మార్చి 2021



# ఆశల బీజాలను నాటుతూ
## మార్పుకు బాటలు వేసిన

**సంపుటి 4**
సాధారణ మనుషుల
అసాధారణ కృషి

Alternatives India
VIKALP sangam

# విషయసూచిక


ఉపోద్ఘాతం 01

1. సంక్షోభానికి స్పందించిన ఢిల్లీ మకాం 04

2. ప్రజల నుండి ప్రజలకు - ఒక సాంఘిక సంఘీభావ వ్యాపార నమూనా 06

3. గుజరాత్ లోని దాహోద్ లో మహిళా అటవీ ఫలసాయ సేకరణదారుల సంఘీభావ ఆర్థిక వ్యవస్థ 09

4. స్థానిక ఉత్పత్తి- మార్కెటింగ్ వ్యవస్థ బలం : కేరళలో దారి చూపిన శ్రీలక్ష్మి మహిళా సంఘం 12

5. కోవిడ్ సంక్షోభ సమయంలో కోర్చి మహాగ్రామసభ క్రియాశీల కృషి 15

6. మార్పువైపు ప్రయాణిస్తూ సంక్షోభాన్ని దాటటానికి ప్రకృతి వ్యవసాయ పద్ధతుల అనుసరణ 18

7. కోవిడ్ విపత్తుకు స్పందనగా పటిష్టమైన ఆహార, వ్యవసాయ వ్యవస్థ నిర్మాణంలో మహిళారైతులు ముందడుగు 21

8. మాకు ఇప్పుడు కార్మికులు అనే గుర్తింపు లభించింది" - నిర్మల కధ 24

9. యమునా ఖద్దార్ లో కోవిడ్ విపత్తును ఎదిరించిన మహిళా రైతులు 27

10. కోవిడ్ సమయంలో మహిళా రైతుల ప్రత్యామ్నాయ కృషి నమూనాలు 30

11. కోవిడ్-19 లాక్ డౌన్ లో మహిళా రైతులు : సహాయ కార్యక్రమాల అవసరం 33

12. కోవిడ్-19 సందర్భంలో చిరుధాన్యాల వైపు తిరిగి ప్రయాణం 36

13. ఆర్థిక సంఘీభావం, స్వయం శక్తి పై ఆధారపడటం వైపుగా హాపూర్ మహిళా రైతుల ప్రయాణం 39

నేర్చుకున్న పాఠాలు - భవిష్య త్ మార్గం 41

# మకాం పరిచయం

మహిళా రైతుల హక్కుల వేదిక (మకాం) 2014 లో ఏర్పాటైంది, ఇది మహిళా రైతులు, సంస్థలు, సంఘాల జాతీయ వేదిక. రైతులు అంటే వ్యవసాయము దాని అనుబంధ కార్యకలాపాల్లో పాలుపంచుకుంటున్న సాగుదారులు, వ్యవసాయ కూలీలు, అడవిపై ఆధారపడిన ఆదివాసులు, పశుపెంపకందారులు అని నిర్వచించిన 2007 జాతీయరైతు విధానం ప్రకారం మహిళా రైతులను గుర్తించి, వారి గొంతును వినిపించటం మకాం ప్రధాన ఉద్దేశం. సహజవనరులపై మహిళలు పనిచేసే రంగంలో పితృస్వామ్య భావజాలము , దానితో పాటు వర్గం, కులం, మతం వంటి ఇతర సామాజిక, ఆర్థిక, తేడాలను సూక్ష్మంగా విశ్లేషించడానికి మకాం కృషి చేస్తున్నది.

## నేపధ్యం

కోవిడ్ విపత్తు, దాని కారణంగా విధించిన లాక్ డౌన్ మహిళా రైతులలోని వివిధ సెక్షన్లలో విపరీతమైన కష్టాలను, బాధలను సృష్టించి మహిళల వేతనంలేని పని సమస్యను గతంలో ఎన్నడూ లేనంతగా ముందుకు తెచ్చింది. పితృస్వామ్య అణచివేత, కులం, వర్గం తదితర సామాజిక వివక్షను అమలుచేసే వ్యవస్థల మూలంగా మహిళలు అనుభవించే ప్రతికూలతల వల్ల వారు మరింత ఎక్కువగా కష్టాలు ఎదుర్కోవలసి వచ్చింది. అన్ని సామాజిక వర్గాలకు చెందిన మహిళలపైన లాక్ డౌన్ సమయంలో హింసాత్మక సంఘటనలు పెరిగినట్లు వార్తలు వచ్చాయి. అయితే, ఆకలి, ఆదాయం కొరత, కుటుంబంలో అందరికీ ఆహారం అందుబాటు లేకపోవటం, పని అవకాశాలు తగ్గటం కారణంగా వారిపై పని భారం పెరిగింది అనేవి భారతదేశంలో కోవిడ్ సమయంలో వివిధ సెక్షన్లమహిళా రైతుల దుస్థితిని సంగ్రహంగా వివరిస్తాయి. .

మహిళా రైతులు పంటల సాగు, వేతన శ్రమ, చేపల పెంపకం, పశుపెంపకం, అటవీ ఉత్పత్తుల సేకరణ, పోడు వ్యవసాయం వంటి అనేక రకాల జీవనోపాధి కార్యకలాపాలలో నిమగ్నమై వున్నారు. కోవిడ్ లాక్ డౌన్ సమయంలో ఈ రంగాలలో పనిచేస్తున్న మహిళా రైతులు అందరు తీవ్రమైన కష్టాలను ఎదుర్కొన్నారు. వారు వ్యవసాయంలో పెట్టుబడి పెట్టటానికి డబ్బు లేక, తమ వ్యవసాయ ఉత్పత్తులను అమ్ముకునే దారి లేక, ఉత్పత్తులను నిల్వ చేసే వసతి లేక ఇళ్ల వద్దనే పెట్టుకునే పరిస్థితి కారణంగా చాలా ఇబ్బందులు పడ్డారు. మార్కెట్లకు వెళ్లే వీలు లేక వారి ఉత్పత్తులు చాలా వరకు పాడైపోయి నష్టపోయారు. ఒంటరి మహిళా రైతులు సాధారణంగా తమ వ్యవసాయ ఉత్పత్తులను ప్రయివేటు వ్యాపారస్తులకు అమ్ముకుంటారు కాబట్టి కనీస మద్దతు ధరలు వాళ్ళకి అందవు, కానీ లాక్ డౌన్ సమయంలో ధరలు మరింతగా పడిపోయి వారికి సాగు ఖర్చుకూడా అందటం గగనమైంది. అటవీ నివాసులు, ఆదివాసీ మహిళలు కలపేతర అటవీ ఉత్పత్తులను అమ్ముకోలేకపోయారు. మహిళా సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల(ఎఫ్ పి ఓ లు) సంఘాల అమ్మకాలు నిలిచిపోయి అవి తమ కార్యకలాపాలు నిరంతరాయంగా సాగటానికి రుణాలు, మార్కెట్ సహాయం కోసం ఎదురుచూస్తున్నాయి .

ఉపాధి కోసం డిమాండ్ పెద్ద ఎత్తున పెరిగింది కానీ మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం లాక్ డౌన్ విధించిన రెండు నెలల తర్వాత కానీ ప్రారంభం కాలేదు. దీని వల్ల కష్టాలు మరింత పెరిగాయి, ప్రత్యేకించి కుటుంబాలలో ఏకైక సంపాదనపరులుగా వున్న ఒంటరి మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వారిలో అనేక మంది గ్రామాలకు తిరిగి వస్తున్న వలస కార్మికులతో ఉపాధి కోసం పోటీ పడవలసి వచ్చింది.

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన అనే ఉపశమన కార్యక్రమం మహిళా రైతులలో అత్యధికులకు ప్రయోజనం కలిగించలేదని మకాం సభ్యులు మహారాష్ట్ర, గుజరాత్ తదితర రాష్ట్రాలలో చేసిన అధ్యయనాలు తెలియజేశాయి.

వారికి ఆధార్ కార్డు, రేషన్ కార్డు వంటివి లేకపోవటం, వారి పేరు మీద భూమి పట్టా లేకపోవటము, వల్ల చాలా మంది మహిళలకు ఈ సహాయం అందలేదు.

అయితే అన్ని అనుభవాలు ప్రతికూలంగానే లేవని ఇక్కడ మేము చెప్పబోయే కథలు నిరూపిస్తున్నాయి. తీవ్రమైన ప్రతికూల పరిస్థితి వున్నప్పటికీ మహిళారైతులు, మహిళా రైతుల సముదాయాలు, వేదికలు, సంఘాలు ఆకలి, ఉపాధి లేకపోవటం అనే సమస్యలను పరిష్కరించుకోవటంలో చొరవతో కొత్త మార్గాలను కనుగొన్నారు.

## ఈ కథలు చెబుతున్నది ఏమిటి ?

ఇది మహిళా సంఘాలు చొరవతో, నాయకత్వం వహించి ఆహారం, ఉపాధి అవకాశాలు కల్పించే రూపంలో అవసరంలో వున్నవారికి సహాయం అందించటం గురించిన కథల సమాహారం.

మహిళా సంఘాలు, గ్రామ వేదికలు, పంచాయతీలు లేదా వ్యక్తిగత మహిళా రైతులు ముందుకొచ్చి ప్రజలకు సహాయ చర్యలు అందించిన అనేక సంఘటనలలో ఈ 13 ఉదాహరణలు.కొన్ని. కొన్ని సమయాల్లో వారు ప్రజలకి సహాయం అందించటానికి ప్రభుత్వానికి సహకారం అందించారు. కానీ చాలా సార్లు సహాయంకోసం స్థానిక, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలతో పోరాడాల్సి వచ్చింది. ఇక్కడ ఇచ్చిన ఉదాహరణలు గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కేరళ, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలవి.

మహిళల నాయకత్వంలో జరిగిన ఈ ప్రయత్నాలు గ్రామస్థాయిలో సంఘీభావం ఆధారంగా చేసే ఆర్థిక కార్యకలాపాలకు మార్గం చూపాయి . ప్రతికూలతలు ఎదురైనప్పుడు సహాయం అందించటంలోను, ప్రభుత్వంతో పోరాడటం లోను, స్థానిక సమూహాలను సమీకరించటంలోనూ సాధారణ ప్రజలు ఏ విధంగా అసాధారణ పాత్ర పోషించారో ఈ కథలు చెబుతాయి. స్వయం పోషకత, సమిష్టి ఉత్పత్తి, సంఘీభావాలు అనేవి కష్ట సమయాలలో అత్యంత కీలకమని రుజువుచేశాయి. . .

ఈ కథలు చాలా వరకు డబ్బు పాత్ర లేని ఆర్థిక వ్యవస్థకు, సాంఘిక సంఘీభావానికి మార్గం చూపిస్తాయి. ఉదాహరణకి సరుకులను డబ్బుతో కాక ఇతర సరుకులతో మార్పిడి చేసుకున్నారు. పంచాయతీలు ముందుకొచ్చి పని అవకాశాలను కల్పించేందుకు, ఆహారం రూపంలో సహాయం అందించేందుకు చర్యలు తీసుకున్నాయి. ఈ ఉదహారణలు సాంఘిక సంఘీభావం దిశలో ముందుకు సాగటానికి అవకాశాలను అందిస్తాయి, డబ్బు మార్పిడి పైన మాత్రమే ఆధారపడకుండా సరుకులను, సేవలను పంపిణీ చేసుకునే పరస్పర సహకార పద్ధతులకు వీలు కల్పిస్తాయి.

ఇక్కడ నమోదు చేసిన వివిధ కథల ద్వారా ప్రతికూలతలను తట్టుకుని నిలబడటం అనే ఉపయోగకరమైన భావనను చర్చించవచ్చు.. ఈ భావనను వర్తింపచేయటం అంటే మరొక ప్రత్యామ్నాయ అవకాశంలేని పరిస్థితిలో స్పందించటం అనే భావనను దాటి ముందుకెళ్లి మాట్లాడుతున్నాము. సహిష్ణుత, తట్టుకుని దృఢంగా నిలబడడం అనే భావనకున్న స్త్రీవాద అవగాహన అధికారం, సామాజిక న్యాయం అనే సమస్యలను గుర్తిస్తుంది, అది తట్టుకుని నిలబడడం అనే భావనను అనుకూల ఫలితాలను కనుగొనే సామర్థ్యంగా కూడా చూస్తుంది.

కష్టకాలంలో మానవ అనుభవాలను అర్థం చేసుకోవటము , వాటిని విధానాలలోకి, ఆచరణలోకి తీసుకెళ్లటము కూడా తట్టుకుని నిలబడటం ఉపయోగకరమైనదిగా చూస్తున్నాము . కోవిడ్ విపత్తు వంటి ప్రతికూలపరిస్థితి ఎదురైనప్పుడు శక్తులను సమీకరించుకోవటానికి ఈ సహిష్ణుత, తట్టుకున్ని నిలబడటం అనేది ఒక వెసులుబాటు కల్పించే ప్రక్రియగానే కాక సమాజంలో వ్యవస్థీకతంగా వున్న కులం, వర్గం, పితృస్వామ్యం వంటి పాతుక్కుపోయిన వ్యవస్థలను సవాలు చేయటానికి కూడా సాధనంగా ఉపయోగపడుతుంది అని స్త్రీ వాద అవగాహన గుర్తిస్తుంది.

ఇబ్బందులను తట్టుకుని నిలబడటం లేదా కొత్త పరిష్కారాలను కనుగొనటము, సృజనాత్మతక పద్ధతులను అవలంబించే సామర్థ్యము మహిళల సాధికారతకు దారితీసే ప్రక్రియలో భాగమేనని ఈ కథలు సూచిస్తున్నాయి . వీటిలోని ప్రతి ఒక్క ఉదాహరణ సమూహాలు, వాటితో కలసి పనిచేసే సంస్థల మధ్య పరస్పరం సంపన్నవంతం చేసే ప్రక్రియల గురించి చెబుతుంది.

## భవిష్యత్తుకు మార్గం

ఒక విశాల వేదికగా మకాం క్షేత్ర స్థాయిలో సహాయ చర్యలలో క్రియాశీలంగా పాల్గొనటమేకాక జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్ ఎచ్ ఆర్ సి ), నీతిఆయోగ్ వంటి వివిధ సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వాలతో కూడా పనిచేస్తూ సమస్యలను వాటి దృష్టికి తీసుకెళ్లి ఆహారం, ఉపాధి అందించటానికి సంబంధించి ప్రభుత్వ వ్యవస్థలను బలోపేతం చేయటానికి సలహాలు, సూచనలను ముందుంచింది.

చౌక ధరల దుకాణాల ద్వారా జరిగే ఆహార పంపిణి వ్యవస్థ అనేది అర్హతా పత్రాల ఆధారంగా కాకుండా సార్వజనీనంగా అందరికీ ఇవ్వాలనే తక్షణ డిమాండ్ ను మకాం ముందుంచింది. ప్రభుత్వ పంపిణి వ్యవస్థలో కేవలం బియ్యం, గోధుమ వంటి ధాన్యాలు మాత్రమే కాకుండా పోషకాహారాన్ని అందించే విధంగా దానిని విస్తరించాలని కూడా డిమాండ్ చేసింది. మహిళా రైతులకు ఉత్పాదక ఆస్తులను కల్పించే పనులతో కూడిన ఉపాధి హామీని అందించే ప్రభుత్వ ఉపాధి కార్యకమాలను విస్తరింపజేయాలన్నది మకాం తీసుకొచ్చిని ప్రధాన డిమాండ్లలో ఒకటి.

భవిష్యత్తులో మహిళలకు ప్రకృతి అనుకూల సుస్థిర గ్రామీణ జీవనోపాధులను పునర్నిర్మించి, మద్ధతునిచ్చి బలోపేతం చేయటానికి ఇది ఒక అవకాశంగా కూడా చూడవచ్చు . అయితే మహిళలు ఆధారపడుతున్న వ్యవసాయం, నీటి వనరులు తదితర ఉమ్మడి వనరులను పరిపుష్టం చేయటానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టాల్సి వుంది, మహిళలను వనరులనుండి నిర్వాసితులను చేయటంగాక వాటిని సంరక్షించి, ఉపయోగించుకునేందుకు సహాయపడే విధానాలను తీసుకురావాల్సిన అవసరం వుంది. మహిళల మానవ హక్కుల పైకి దృష్టిని కేంద్రీకరించి, అధికారము, వనరుల పునః పంపిణి ద్వారా ప్రస్తుత అభివృద్ధి నమూనాను సమూలంగా మార్చటానికి దూరదృష్టి అవసరం అవుతుంది .

కోవిడ్ అనంతర భారత దేశంలో మహిళల జీవనోపాధులను పునరుద్ధరించటంలో, సామాజిక ఆర్ధిక సంఘీభావాలను బలోపేతం చేయటానికి వినూత్న మార్గాలను ఆవిష్కరించడంలో ఈ ఉదాహరణలు ముఖ్యమైన గుణపాఠాలు అందిస్తాయి.

# 1. సంక్షోభాన్ని ఎదుర్కోవటానికి మకాం ఢిల్లీ కృషి

**రచయిత** : డాక్టర్ సోమా కె. పార్థసారధి, సులేఖా (యాక్షన్ ఇండియా), ముబాషిరా జైదీ

మకాం ఢిల్లీ బృందం 2020 మార్చ్ లో లాక్ డౌన్ విధించిన సమయంలో ఏర్పడింది. 2020 ఫిబ్రవరి చివరలో తూర్పు ఢిల్లీలో అల్లర్లు జరిగిన నేపథ్యంలో ఈ బృంద సభ్యులం ఒకదగ్గరకి వచ్చాము. మా బృందంలోని సభ్యులు అనేక మంది ఢిల్లీలో వుండి మకాం ఎజెండాతో వివిధ స్థాయిలలో పనిచేస్తున్నప్పటికీ ఢిల్లీ, దాని చుట్టుపక్కల సంక్షోభ కాలం తలెత్తినప్పుడు బస్తీలలోని సమూహాలకు మేము ఒక బృందంగా సహాయపడాల్సిన అవసరం ఉందని గుర్తించి మా ప్రయత్నాలను సమిష్టిగా చేపట్టడానికి ఒక బృందంగా ఏర్పడ్డాము. మేము ఈశాన్య రాష్ట్రాలలో తీవ్ర ఇబ్బందులలో వున్న అక్కచెల్లెళ్లకు ఆకలిసమస్యను పరిష్కరించటంలో సహాయపడటానికి కూడా మా సహకారం అందించగలిగాము.

ఢిల్లీలోని బస్తీలలో వుండే జనాభా ఎక్కువగా నగరానికి వలసవచ్చినవారు లేదా నగరంలోనే వారుంటున్న మురికివాడల నుండి నిర్వాసితులను చేసి నగర శివార్లలో పునరావాసం కల్పించబడి తరలించబడివాళ్ళు. మార్చ్ చివరలో విధించిన లాక్ డౌన్ వల్ల వారు దినసరి వేతనాలు కోల్పోయి తీవ్ర దుస్థితికిలోకి నెట్టబడ్డారు, ఒకటి రెండు వారాలలోనే వారంతా ఆకలితో మాడే దుస్థితి ఏర్పడింది. వారిలో ఎక్కువ మంది ఆటో రిక్షా తోలేవారు, ఇళ్లల్లో పనిచేసే గృహ కార్మికులు, కూరగాయలు అమ్మేవారు లేదా చిన్న దుకాణాలు నడిపేవారు, ఇళ్లలోనే వుండి పనిచేసుకునే వారు. వారంతా రోజువారీ ఆదాయంతో ఆహారాన్ని కొనుక్కునేవారు కాబట్టి అకస్మాత్తుగా లాక్ డౌన్ విధించటంతో వారు తక్షణ సంక్షోభానికి గురయ్యారు. తినటానికి తిండిలేక ఆకలికి మాడటం అనేది మొదటి సమస్య అయింది, దానితోపాటు అద్దె ఇళ్లలో వుండే వారు అద్దెలు చెల్లించలేక నివాసం కోల్పోయే ప్రమాదం ఏర్పడింది.

మకాంలో భాగస్వాములుగా వున్న యాక్షన్ ఇండియాకు చెందిన మహిళా పంచాయతీలు, సబలా సంఘాలు 2020 మార్చిలోనే లాక్ డౌన్ విధించే అవకాశాన్ని గ్రహించి కార్యరంగంలోకి దిగాయి. ఈ సంస్థల సభ్యులు అత్యంత దుర్బల స్థితిలో వున్న మహిళల ఆధ్వర్యంలోని కుటుంబాలు సంక్షోభం నుండి బయటపడటానికి దాదాపు రెండు నెలల పాటు ఆహారాన్ని ఇతర నిత్యావసర సరుకులను అందించారు. పట్టణ పేదలతో పాటు గ్రామాల నుండి నగరానికి వలస వచ్చిన పేదలకు, రైతులకు సంచార పశుపెంపకందారులకు, చిరు వ్యాపారస్తులకు ఢిల్లీ లోని 12 బస్తీలు/ మురికివాడలలో వారు సహాయం అందించారు. ఎటువంటి సహాయం అందని ఈ జనాభాకు ఆహారం తదితర సరుకులను అందించటానికి ప్రభుత్వ సంస్థలు, ప్రయివేటు సహాయ బృందాలతో సంబంధాలను ఏర్పరచుకుని వ్యవస్థలను స్థాపించటం మొదటి ప్రాధాన్యత అయింది. అత్యంత పేదరికంలో, దుస్థితిలో వున్నవారి జాబితాలు తయారు చేసి సహాయ బృందాలకు సమాచారం అందించి ఆహారం తదితర సరుకులను నగరంలోని అవసరం వున్న ప్రాంతాలకు చేరవేయటం జరిగింది. ఏ ప్రాంతాలనుండి సహాయంకోసం ఫోన్లు వస్తున్నాయో, అక్కడి ప్రజలకు ఢిల్లీ సహాయ బృందాలలోని దాతల సహాయంతో సహాయం అందించాము. వారిలో ఎక్కువగా బయటనుండి వచ్చినవారు, రేషన్ కార్డులు వంటివి లేనివారికి ఎక్కువగా సహాయం అందించాము. ఢిల్లీ నగరం బయట గ్రామీణ ప్రాంతాల్లో ఫ్యాక్టరీలలో మహిళా సహకార సంఘాలు ఉత్పత్తి చేసిన సానిటరీ నాప్కిన్స్ ను అన్ని బస్తీలలోని మహిళలకు, యువతులకు చాలా వరకు ఉచితంగా అందించాము. ఈ పనిలో పాఠశాల, యూనివర్సిటీ విద్యార్థినులు మాతో చేతులు కలిపారు. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం కూడా మేము, ఇతర సహాయ కమిటీలు సమన్వయంతో సాగిస్తున్న సహాయ చర్యల ద్వారా అవసరం వున్న పేద ప్రజలకు ఆహారం, సరుకులు, మందులు వంటివి అందించటానికి మా పై ఆధారపడటం మొదలైంది.

మకాం బృందం చేసిన కృషి ద్వారా ఢిల్లీలో 5,600 కుటుంబాలకు 4 నెలలపాటు ఆహారం అందిింది, 100 మంది పిల్లలకు అదనపు పౌష్టిక ఆహారం అందిింది, అందులో నాల్గవ వంతు గూంజ్ అనే సంస్థ అందించింది. సహాయ చర్యలు చేపట్టిన ఢిల్లీలోని అనేక బృందాల ద్వారా గణనీయమైన ఆర్థిక సహకారం వచ్చింది. ప్రభుత్వ యంత్రాగం దృష్టిలోకి రాని గ్రామీణ జనాభాకు సహాయం అందించటానికి మరింత ఎక్కువ సమన్వయం అవసరమైంది.

ఢిల్లీ రిలీఫ్ కలెక్టివ్, ఇంకా ఇతర వ్యక్తులు అందించిన ఆర్థిక సహాయంతో ఇతర రాష్ట్రాలలోని పేదలకు, రైతులకు సహాయం అందించాము, గ్రామీణ ప్రాంతాలలోని 400 మంది ఒంటరి మహిళల్లకు ఆహారం, విత్తనాలు, ధాన్యపు బ్యాంకుల రూపంలో అందించగలిగాము. ఢిల్లీ లోని చిరు వ్యాపారస్తులకు వారి వ్యాపారాలను తిరిగి నిలబెట్టుకోవడానికి చిన్న మొత్తాలను గ్రాంట్ గా ఇచ్చాము. మా బృందం వలస కార్మికులు బీహార్, అస్సాం, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలోని వారి స్వంత గ్రామాలకు తిరిగి వెళ్ళటానికి ప్రయాణ వసతినిని కూడా సమన్వయం చేసింది. ఢిల్లీ లో 4000 మంది వలస కార్మికులకు తాత్కాలిక నివాస వసతి కల్పించాము. నగరంలోని కొన్ని ప్రాంతాలలో పార్క్ లు ఉమ్మడి ప్రదేశాలలో పెరటి తోటల పెంపకం, కంపోస్ట్ ఎరువు తయారు చేయటం వంటి కార్యక్రమాలను కూడా మా బృందం సభ్యులు స్థానిక ప్రజలతో చర్చించి ప్రోత్సహించాము.

లాక్ డౌన్ క్రమంగా ఎత్తివేయటంతో మేము చేసిన సహాయ కార్యక్రమాల ఫలితంగా ఒక సమిష్టి భావన, సంఘీభావ తత్వం ఏర్పడింది. అది ఆ తర్వాత కూడా కలిసి పనిని కొనసాగించటానికి సహాయపడింది. తర్వాత కూడా కోవిడ్ విస్తరిస్తున్న నేపథ్యంలో సంక్షోభ కాలంలో దళితులు ఆదివాసులకు విత్తనాలు కొనుగోలు చేయటానికీ, ఒంటరి మహిళలు చిన్న వ్యాపారాలు మొదలుపెట్టటానికీ, పని వెతుక్కోవటానికీ, వైద్య సహాయం పొందటానికీ మేము సమిష్టిగా పనిచేయటానికి ఉతేజాన్నిచ్చింది.

ఇప్పుడు మహిళలు గ్రామాల నుండి పట్టణాలకు సరుకులను అందించే వ్యాపారాలను మొదలుపెడుతున్నార్రు, మసాలాలు, గోధుమ, తక్కువ ధరకు సానిటరీ తువ్వాళ్లు వంటి సరుకులను తెచ్చి ఢిల్లీలో అమ్మటం మొదలుపెట్టారు. ఇటువంటి ప్రయత్నాలు ప్రస్తుత కష్టకాలంలో ఆర్థికంగా కోలుకునే సమయంలో సుస్థిరతను కల్పించి ఉపశమనాన్ని అందిస్తాయని ఆశిస్తున్నాము.

లాక్ డౌన్ కాలంలో ప్రజా సమూహాలు, ఒంటరి మహిళలు తట్టుకుని నిలబడటానికి కనబరిచిన దృఢ నిశ్చయం వారి సత్వర స్పందన, దూరదృష్టి వల్ల సాధ్యపడింది. అనేక బృందాలు, అనేక ప్రాంతాలనుండి పెద్ద ఎత్తున అందిన ఆర్థిక సహాయం భవిష్యత్తులో తట్టుకుని నిలబడగల రనే ఆశను రేకెత్తిస్తుంది .

# 2. ప్రజల నుండి ప్రజలకు - సామాజిక సంఘీభావ వ్యాపార నమూనా

**రచయితలు**: నఫీసా బారోత్, పల్లవి సొబ్తి రాజ్పాల్

ఫోటో: ఉత్థాన్



గుజరాత్ లోని భావనగర్ జిల్లా మహువా బ్లాక్ లో రాటోల్ గ్రామంలో ఆహార పంపిణి

గుజరాత్ లోని కరువు పీడిత కోస్తా తీర జిల్లాలు, పేదరికంలో మగ్గుతున్న ఆదివాసీ జిల్లాలలో ఉత్థాన్ అనే సంస్థ దాదాపు 40 ఏళ్ళు గా అత్యంత అణగారిన సమూహాలలో జెండర్ స్పృహను కలిగించే క్షేత్ర స్థాయి కార్యక్రమాలు చేపడుతూ వస్తున్నది . ఈ రోజున ఈ సంస్థ గుజరాత్ లోని 6 జిల్లాలలో 412 గ్రామాలకు చెందిన 14 లక్షలకంటే ఎక్కువ మంది జీవితాలను ప్రత్యక్షంగా తన పనిద్వారా ప్రభావితం చేస్తున్నది.

మహిళల సంఘాల సమాఖ్యలను నిర్మించి వాటి ద్వారా స్వతంత్రంగా సాధికారతను నిలబెట్టుకునే సామర్ధ్యాన్ని పొందటము , అందరినీ కలుపుకుని వెళ్లే అభివృద్ధి ప్రక్రియలను చేపట్టటము ఉత్థాన్ వ్యూహంగా రూపుదిద్దుకుంది. అటువంటి 5 సమాఖ్యలు ఏర్పడి గ్రామీణ మహిళల, అణగారిన సెక్షన్ల ప్రజల హక్కులకు రక్షణ కల్పించే సామాజిక సంస్థలుగా అవి ఎదిగాయి. గత 15 ఏళ్లలో 8000 కంటే ఎక్కువ మంది సభ్యులు ప్రభుత్వ ప్రయివేటు వనరులపై తమ హక్కులను, రైతులుగా తమ గుర్తింపును బలోపేతం చేసుకుంటూ వ్యవసాయంలో, పశుపెంపకంలో, చేపల పెంపకంలో ప్రయోగాలు చేశారు.

ఆకస్మికంగా కోవిడ్ లాక్ డౌన్ విధించినప్పుడు మొట్టమొదట అప్పటికే అణగారి అంచులకు నెట్టివేయబడిన వారి ఆహార అందుబాటుపై తీవ్ర ప్రభావం పడినట్లు ఉత్థాన్ దృష్టికి వచ్చింది. ఆహార పదార్ధాలు, కూయగాయల సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో నగదు చేతిలో లేని కుటుంబాలలో ఆహారం దొరకదేమోననే భయం ఎక్కువైంది. ప్రభుత్వం మంచి ఉద్దేశంతోనే సహాయం అందించినప్పటికీ ప్రజల అవసరాలను తీర్చటానికి పభుత్వ సహాయం సరిపోలేదు, పైగా వలస వెళ్లిన వాళ్ళు గ్రామాలకు తిరిగి వస్తుండటంతో సమస్య మరింత పెరిగిందని మాకు సమాచారం అందింది. ధన్ పూర్ బ్లాక్ లోని రియవాన్ గ్రామంలో వలిబెన్ పలాష్ అనే మహిళ తాను పండించిన గోధుమ, మక్కజొన్న పంటను అమ్ముకోవటం ఎట్లానని ఆందోళన పడింది. ప్రత్యేకించి ఒంటరి మహిళలు తమ ఉత్పత్తులను రవాణా చేయటం, గిట్టుబాటు ధరలు పొందటం అనే సమస్యలు ఎదుర్కొన్నారు. కేవలం 40% మంది మాత్రమే తమ రబీ

ఫోటో: ఉత్థాన్



గుజరాత్ లోని దాహోద్ జిల్లా ధన్ పూర్ బ్లాక్ లోని రైయవాన్ గామంలో శకుబెన్ (ఎడమ వైపున ), వలిబెన్ అనే రైతు (కుడి పక్కన)

పంటలను అమ్ముకోగలిగారు, 40% మందికి 2020 జులైలో ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ యోజన సహాయం అందలేదు

క్షేత్రస్థాయిలో మహిళా నాయకులతో జరిపిన చర్చలు కోవిడ్ సంక్షోభాన్ని తగ్గించటానికి సామాజిక సంఘీభావ వ్యాపార నమూనాలను అమలుచేయాలని నిర్ణయం తీసుకోవటానికి దారి తీశాయి. కమ్యూనిటీ నాయకులతో సమిష్టిగా చర్చలు జరిపి అత్యంత పేదరికంలో వున్నవారికి సాధికారత కలిగించే ప్రక్రియ ద్వారా సహాయం అందించాలని, వివిధ సెక్షన్ల, బృందాల మధ్య సహసంబంధాలు నిర్మించాలనేది ఇక్కడ ఆలోచన . భావనగర్, దాహొద్, పంచమహల్స్, మహిసాగర్ జిల్లాలోని 129 గ్రామాలలోని 3618 కుటుంబాలకు ఆహార పదార్ధాలు, నిత్యావసర సరుకులను అందించటం ద్వారా సంఘీభావం నెలకొల్పాలనని ప్రణాళిక వేశారు. ఇందుకు అవసరమైన ఆహారధాన్యాలను మహిళా రైతులు/ మహిళా వ్యాపారులనుండి కొనుగోలు చేయాలని నిర్ణయించారు. లేనట్లయితే మహిళా రైతులు వారి నగదు అవసరాల రీత్యా తమ ఉత్పత్తులను ఎంతో కొంతకు అమ్ముకునేవారు. దీనితో పాటు 120 గ్రామాలలో రేషన్ దుకాణాల ద్వారా ప్రభుత్వ పంపిణి వ్యవస్థలోనూ, అన్న బ్రహ్మ పథకంలోనూ వున్న లోపాలను అధ్యయనం చేసి ఆ గణాంకాలను జిల్లా అధికారులకు అందించి.

ఈ లోపు గ్రామ పెద్దలు, సమాఖ్య సభ్యులు, పంచాయతీల సహకారంతో పేద కుటుంబాలను గుర్తించారు. తమ ఉత్పత్తిని అమ్ముకోవటానికి ఇబ్బందులు పడుతున్న రైతులను అదే గ్రామం నుండి, లేదా చుట్టుపక్కల గ్రామాల నుండి గుర్తించి మహిళా నాయకులూ, గ్రామ అభివృద్ధి కమిటీలు వారిని కలిసి చర్చించారు. ఉత్థాన్ సంస్థకు ప్రజలలో వున్న సంబంధాలు, వారు మహిళా రైతులతో చేస్తున్న కార్యక్రమాల ఫలితంగా రైతులకు సరైన ధర చెల్లించటంతో ఈ పని సులభంగా జరిగింది.

ఉత్పత్తులకు చెల్లింపులు మహిళల బ్యాంక్ అకౌంట్ లలోకి డిపాజిట్ చేశారు, వారిలో ఎక్కువ మంది భూమి హక్కులు లేకుండానే కుటుంబ భూమిలో శ్రమ చేస్తున్నారు. సరుకులను కిరాణా దుకాణం నుండి కాకుండా విడిగా మహిళా రైతులనుండి కొనుగోలు చేయటానికి కొంత సమయం ఎక్కువ పట్టినప్పటికీ, అమ్ముకోవటంలో సమస్యలు ఎదుర్కొనే మహిళలకు ధాన్యం అవసరం ఉన్నవారికీ మధ్య సంబంధాలు ఏర్పడటంలో ఇది సహాయపడింది. వలిబెన్ తన ఉత్పత్తిని కేజీ 19 రూపాయల చొప్పున అమ్ముకున్నందుకు సంతోషపడింది, సాధారణంగా మార్కెట్ లో అమ్ముకుంటే ఆమెకు కేజీ కి 20-22 రూపాయల ధర లభించేది, కానీ మార్కెట్ కి ధాన్యాన్ని రవాణా చేయటానికి కేజీకి 5 రూపాయల ఖర్చు అయ్యేది. “నేను స్థానికంగా అమ్ముకోవటం వల్ల ఆ ఖర్చు అదా అయింది” అని వలిబెన్ చెప్పింది. .

ఆ విధంగా కొనుగోలుచేసిన ధాన్యాన్ని మహిళా నాయకులూ, ఉత్థాన్ బృందం కలసి కిట్లుగా తయారుచేసి స్థానిక యువకులు, పంచాయతీల ద్వారా పంపిణి చేశారు. మొత్తం మీద 54,27,000రూ. విలువైన ఆహార ధాన్యాలను పంపిణి చేశారు. 78 మంది మహిళా రైతులు 44136 కేజీల ధ్యాన్యాన్ని అమ్ముకోగలిగారు, వారికి 9,12,980రూ. ఆదాయం వచ్చింది. మహిళా రైతుల బ్యాంక్ అకౌంట్ లోకి వెళ్లిన ఈ డబ్బు తిరిగి వారి స్థానిక ఆర్ధిక వ్యవస్థలోకి పెట్టుబడిగా వెళ్ళింది. బయట అమ్ముకోవటంతో పోల్చినప్పుడు ఇంటి వద్ద అమ్ముకోవటం

*ద్వారా మహిళలు 16% ప్రయోజనం పొందారు, దానికి తోడు రవాణా చేయటం తప్పింది, గిట్టుబాటు ధర అందుతుందో లేదో అనే ఆందోళన తప్పింది. "మేము పండించిన ధాన్యం మా గ్రామంలోనే అవసరమున్న వారికి సహాయపడినందుకు సంతోషంగా తృప్తిగా వుంది, ఈ ఆదాయం మరింత విలువైనది" అని అనేక మంది మహిళా రైతులు చెప్పారు. కొంత మంది మహిళా రైతులు వారి ఉత్పత్తి తమ స్వంత వినియోగానికి మాత్రమే సరిపోతుంది కాబట్టి ఉత్తాన్ కు అమ్మటానికి ముందుకురాలేదు, ఇది కూడా ఒక మంచి నిర్ణయం అనిపించింది.*

*"మేము మా ధాన్యాన్ని బయట ఎందుకు అమ్మాలి, అదే ధాన్యం రేషన్ దుకాణాల ద్వారా బయటనుండి తిరిగి మాకు వస్తుంది కదా? ప్రభుత్వం స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయటానికి ఎందుకు ఆలోచన చేయదు " అని మహిళా సమాఖ్య నాయకులు ప్రశ్నించారు. ఇదే విషయాన్నీ అనేక మంది స్త్రీవాదులు, కొంత మంది ఆర్థికవేత్తలు కూడా ముందుకు తెచ్చారు. ఈ నమూనాను ప్రభుత్వం పెద్ద ఎత్తున అమలుచేస్తే, అంటే స్థానికంగా ఉత్పత్తి జరిగిన ధాన్యం తదితర ఉత్పత్తులను కొనుగోలు చేసి స్థానికంగా పునః పంపిణి చేసినట్లయితే స్థానికంగా ఆహారభద్రత ఏర్పడి, తక్కువ ధరలకు తెగనమ్ముకునే దుస్థితి తగ్గుతుంది, రవాణా ఖర్చు ఆదా అవుతుంది. ప్రజలు తమ స్థానిక ఉత్పత్తుల రుచిని ఆస్వాదించగలుగుతారు.*

ఫోటో: ఉత్తాన్



సమర్థన్ మైల సంఘటన్ కార్యాలయంలో మహిళా రైతల ఉత్పత్తులను కిట్లుగా ప్యాకింగ్ చేస్తున్న గీతాబేన్

# 3. గుజరాత్ లోని దాహోద్ లో మహిళా అటవీ ఉత్పత్తుల సేకరణదారుల సంఘీభావ ఆర్థికవ్యవస్థ

**రచయితలు**: సేజల్ దండ్, నీతా హార్డికర్

ఫోటో: ఆనంది



జామరన్ గ్రామంలో RASKUM మండలి ఏర్పాటు చేసిన ఇప్పపువ్వు సేకరణ కేంద్రం

రత్నమహల్ ఆదివాసీ మహిళా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల మండలి అనేది ఆదివాసీ మహిళా రైతులు, అటవీ ఉత్పత్తుల సేకరణదారుల సంఘం. ఇది గుజరాత్ లోని దాహోద్ జిల్లా దేవగఢ్ బ్లాక్ లో 2008 ఏర్పడింది, దీనిలో 572 మంది సభ్యులున్నారు. దీనిని ఆనంది అనే స్వచ్ఛంద సంస్థ, దేవగఢ్ మహిళా సంఘటన్ కలసి ఏర్పరచాయి. దాహోద్ తూర్పు గుజరాత్ లోని వర్షాధార ప్రాంతంలో వున్న జిల్లా, ఇక్కడ దాదాపు 75% జనాభా షెడ్యూల్డు తెగలకు చెందినవారు. దేశంలోని 200 అత్యంత పేద జిల్లాలో ఇది ఒకటి, ఇక్కడ వలస పోవటమే ఒక బ్రతుకుతెరువుగా వుంది.

ఏరియా నెట్వర్కింగ్ అండ్ డెవలప్మెంట్ ఇనీషియేటివ్స్ (ఆనంది) అనేది ఒక స్త్రీవాద సంస్థ, గ్రామీణ మహిళలలో చైతన్యాన్ని, నాయకత్వాన్ని పెంచి సామాజిక మార్పుకోసం సమష్టిగా సమస్యలను పరిష్కరించుకునే సామర్థ్యాన్ని పెంచేందుకు ఆనంది కేంద్రీకరించి పనిచేస్తుంది. ఆనంది పనిచేసే 7 మహిళా సంఘాలలో రత్నమహల్ మండలి ఒకటి. రత్నమహల్ మండలి సేంద్రియ, అటవీ ఉత్పత్తులను శుద్ధిచేయటం, సేంద్రియ పద్ధతులలో కూరగాయలను, ఆహారాన్ని పండించటాన్ని సాగిస్తుంది.

## కోవిడ్ సమయంలో చేపట్టిన కార్యక్రమం

లాక్ డౌన్ విధించిన 2020 మార్చ్ నుండి మే నెలలు అటవీ ఉత్పత్తుల సేకరణ అత్యధికంగా జరిగే కాలం, ఆదివాసీమహిళలు ఈ కాలంలో బీడీ ఆకులు, ఇప్పపూలు సేకరించి జీవనోపాధి కోసం అమ్ముకుంటారు. రవాణా పై ఆంక్షలు విధించటం కారణంగా గుజరాత్ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ మరియు ప్రయివేటు వ్యాపారులు నెలకొల్పే కొనుగోలు కేంద్రాల సంఖ్య గణనీయంగా తగ్గింది. అటవీ ఉత్పత్తుల అమ్మకం ద్వారా ఆదాయమే ప్రధాన జీవనోపాధి వనరుగా బతికే అటవీ నివాసులకు ఇది పెద్ద సంక్షోభాన్ని సృష్టించింది.

ఫోటో: ఆనంది



దేవ్లి కువ గ్రామంలో తన పేరుమీద రిజిస్టర్ చేయించుకున్న అటవీ భూమిలో సాంప్రదాయ పంటతో నందాబెన్

భారత ప్రభుత్వ గిరిజన సహకార మార్కెటింగ్ ఫెడరేషన్(ట్రైఫెడ్) ఇప్ప పూల ధరను కేజీ 17 రూ.లనుండి 30రూ.లకు పెంచింది, కానీ ఇప్పపూవు కొనుగోలును నియంత్రించే వ్యవస్థ లేకపోవటం చేత స్థానికంగా చాలా వరకు ఇప్పపూవుకు కిలోకి 17 నుండి 20 రూ. వరకు మాత్రమే లభించింది.

వర్మీ కంపోస్ట్, సేంద్రియ విత్తన తయారీ అమ్మకాలు జరిపే ఆదివాసీ మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘం కార్య వర్గ కమిటీ సభ్యులతో 2020 మే నెల 9వతేదీన ఆనంది సంస్థ బాధ్యులు టెలిఫోన్ లో జరిపిన సమావేశంలో అటవీ ఉత్పత్తుల అమ్మకాలలో ఎదుర్కుంటున్న సమస్యను చర్చించారు. ఆదివాసీ మహిళలు అటవీ ఉత్పత్తులను అమ్ముకోవటంలో సహాయపడటానికి రత్నమహల్ మండలి నిర్ణయం తీసుకోవటంలో ఆనంది సహకారం అందిస్తామని ప్రకటించింది. అయితే మండలి సభ్యులు రెండు రోజులలోపు ఇప్ప పూలకు మెరుగైన మార్కెట్ ధర లభించే విధంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి వుండింది.

రత్నమహల్ మండలి కార్యవర్గ సభ్యులు వారి సభ్యులున్న గ్రామాలలో ఇప్పపూల సేకరణకు మూడు ప్రాథమిక కేంద్రాలను ఏర్పాటు చేశారు, అదే సమయంలో స్థానిక మార్కెట్లను కూడా వెతకసాగారు. కొంత ప్రయత్నాల తర్వాత ఎండిన ఇప్పపూలు కేజీ 40 రూ.లకుకొనుగోలు చేసే ఒక వ్యాపారిని కనుగొన్నారు. మండలి కార్యవర్గ సభ్యులు ఇప్పపూల సేకరణ, అమ్మకాలను పూర్తిగా స్వచ్ఛందంగా సాగించారు, కరోనా కష్టకాలంలో అటవీ ఉత్పత్తుల సేకరణదారులకు మంచి ఆదాయం అందించే ఉద్దేశంతో తాము లాభాలు తీసుకోకుండా నిర్వహించారు. లాక్ డౌన్ సమయంలో అటవీ నివాసులు సమిష్టిగా ఫారెస్ట్ గార్డులతో సంప్రదించి అటవీ ఉత్పత్తుల సేకరణే తమ ఏకైక జీవనోపాధి అని ఒప్పించి సేకరించుకోగలిగారు.

అప్పటివరకు “ఫాడ్ మున్షి” అని పిలిచే గ్రామ సేకరణదారుడిని గుజరాత్ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ అటవీ ఉత్పత్తుల సేకరణకు సంప్రదించనేలేదు, సేకరణకు అవసరమైన నగదును అతనికి అందించలేదు. అటవీ ఉత్పత్తుల సేకరణదారులలో చాలా మంది తమ ఉత్పత్తులకు బదులుగా మొక్కజొన్న లేదా చక్కెర మార్పిడి చేసుకున్నారు ఎందుకంటే అవి కావలసినంత అందుబాటులో లేక వాటి ధరలు బాగాపెరిగాయి. మరి కొద్ది మందికి నగదు అవసరం ఉందని కూడా మండలి ఆధ్వర్యంలో సేకరణ మొదలైన కొద్ది రోజులకే కార్యవర్గ సభ్యులు గుర్తించారు.దీనితో మండలి సభ్యులు దగ్గరలోని బ్లాక్(తాలూకా ) కేంద్రం నుండి పెద్ద మొత్తంలో మొక్కజొన్నలు, చక్కర సేకరించాలని నిర్ణయించారు. చక్కెరను 40రూ.లకు, మక్కజొన్న 22 రూ. లకు మార్కెట్ నుండి కొనుగోలు చేశారు. అటవీ ఉత్పత్తుల సేకరణదారులకు వారి అవసరం మేరకు ధాన్యం కానీ లేదా నగదు కానీ చెల్లించారు.

రత్నమహల్ మండలి స్థానిక ప్రజల దుస్థితిని గ్రహించింది కానీ స్థానిక వ్యాపారుల జోక్యానికి భయపడి ఇప్పపూల సేకరణలో పెద్ద మొత్తాల పెట్టుబడి పెట్టటానికి కొంత వెనుకాడింది.

అనేక సమావేశాలు, సంప్రదింపులు జరిపిన తర్వాత వాళ్ళు సేకరణ కేంద్రాలను, తూకం వేసే పరికరాలను నెలకొల్పి, మహిళల బృందాలను సేకరణకు నియమించారు, బ్యాంకు నుండి నగదు తీయటం మొదలుపెట్టారు. బ్యాంక్ నుండి నగదు తీయటం అన్నిటికంటే కష్టమైన పనిగా మారింది, ఎందుకంటే బ్యాంకుల వద్ద జనసమ్మర్ధం ఎక్కువగా వుంది, అయినా కష్టపడి నగదు తీసుకొచ్చారు.

## ఫలితాలు - గుణపాఠాలు

ఈ మొత్తం ప్రక్రియలో రైతు ఉత్పత్తిదారుల సంఘం కార్యదర్శి అయిన 26 ఏళ్ల ఆదివాసీ యువతి, ఈ పనిపై ప్రయాణం చేయటానికి బ్లాక్ అధికారుల నుండి పాస్ లు సంపాదించే విషయంలో చాలా విషయాలు నేర్చుకుంది. 30 కిలోమీటర్ల దూరంలో వున్న బ్యాంకు నుండి ప్రతిరోజు నగదు తీసుకురావటం, మక్కజొన్న, చక్కెర లను రవాణా చేయటానికి వాహనాలను అద్దెకు తీసుకోవటం, కొనుగోలు చేసిన ఇప్పపూవును ఎక్కువరోజులు నిల్వ ఉంచే అదనపు నష్టాన్ని నివారించేందుకు వ్యాపారులతో మంచి ధర కోసం బేరాలు ఆడటం మొదలైనవన్నీ మండలి నాయకులకు మంచి అనుభవాన్ని నేర్పాయి.

ఈ ప్రక్రియ మొదలైన తర్వాత నాలుగు వారాల పాటు మండలి దాహోడ్ జిల్లాలోని 14 గ్రామాల నుండి 225 మంది అటవీ ఉత్పత్తుల సేకరణదారుల నుండి 6,86,00 రూపాయలు వెచ్చించి 16.66 టన్నుల ఇప్పపువ్వును కొనుగోలు చేసింది. వారిలో ఒక్కొక్కరికి సగటున 3048 రూ. ఆదాయం లభించింది.

కోవిడ్ లాక్ డౌన్ సమయంలో ఇప్పపువ్వు సేకరణదారులకు ఖర్చులకు చేతిలో డబ్బు లేదని మండలి గుర్తించింది. వారికి రేషన్ దుకాణాలలో ధాన్యం లభిస్తున్నప్పటికీ వారికి పప్పు, నూనె, కూరగాయల, మసాలాలు వంటివి కొనటానికి డబ్బు అవసరమయింది, వాటిని ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ పథకంలో అందించలేదు. అందుకే మండలి ఆ అదనపు ఖర్చులను ఈ కార్యక్రమం ద్వారా తీర్చాలని నిర్ణయించింది.

ఈ మొత్తం కార్యక్రమం నిర్వహణలో వారి ఆత్మవిశ్వాసం పెరిగింది, వచ్చే సంవత్సరం అటవీ ఉత్పత్తుల సేకరణ సీజన్ లో మరింత పెద్ద ఎత్తున కొనుగోలు కార్యక్రమం చేపట్టాలని, అటవీ కార్పొరేషన్ సేకరణదారులకు ఇచ్చే కనీస మద్దతు ధరకంటే అధిక ధరను అందించాలని మండలి ప్రణాళిక తయారుచేసింది. .

# 4. స్థానిక ఉత్పత్తి, మార్కెటింగ్ : కేరళలో శ్రీ లక్ష్మి మహిళా సంఘం చూపిన మార్గం

**రచయితలు**: ఉష సూలపాని, అరుణ్ ఆర్ ఎస్

ఫోటో: తనల్



సామూహిక పెరటి తోటల కోసం కంపోస్ట్ ఎరువు తయారీ

తనల్ అనేది కొంతమంది ప్రకృతి ఔత్సాహికులు 1986 లో స్థాపించిన స్వచ్ఛంద పరిశోధన - కార్యాచరణ సంస్థ. అప్పటినుండి ఆ సంస్థ వివిధ స్థాయిలలో జీవవైవిధ్యం, పర్యావరణ విద్యపై పరిశోధన, శిక్షణలు సాగిస్తూ ప్రభుత్వ విధానాలలో మార్పుకోసం పనిచేస్తున్నది. గత రెండు దశాబ్దాలుగా ఈ సంస్థ సేంద్రియ / ప్రకృతి వ్యవసాయం, ఆహార సార్వభౌమత్వం, వృధాను తగ్గించటం(జీరో వేస్ట్), రసాయనాల నుండి రక్షణ, వాతావరణ మార్పు అనే అంశాలపై కేంద్రీకరించి పనిచేస్తున్నది. తనల్ గ్రామ స్థాయిలో రైతులు, గ్రామీణ ప్రజల సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, పంచాయతీలు, విద్యార్థులకు ఈ అంశాలపై శిక్షణలు ఇస్తూ వారికి సాధికారత కల్పించటం కోసం కృషి చేస్తుంది. అదే సమయంలో విధానాలలో మార్పు కోసం రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతుంది, సమస్యలను విధాన నిర్ణేతల దృష్టికి తీసుకెళుతుంది. రైతులను వినియోగదారులను ఒక ఉమ్మడి వేదికపైకి తీసుకొచ్చి తనల్ 2003 నుండి సేంద్రియ రైతులు పండిస్తున్న సేంద్రియ ఉత్పత్తుల మార్కెటింగ్ చేపట్టింది. జాతీయ స్థాయిలో తనల్ ఆశా కిసాన్ స్వరాజ్ నెట్వర్క్ తో, హిమాలయన్ రాష్ట్రాలలో జీరో వేస్ట్ అంశంపైనా, అంతర్జాతీయ స్థాయిలో రసాయనాల నుండి రక్షణ కల్పించే విధానాలపైనా పనిచేస్తుంది. ఈ విషయంలో గత రెండు దశాబ్దాలుగా ఐక్యరాజ్య సమితి సదస్సులలో పరిశీలక సంస్థగా వుంది.

కేరళలోని ప్రఖ్యాత పర్యాటక స్థలమైన కోవళం సమీపంలో వెల్లార్ అనేది ఒక చిన్న కోస్తా తీర గ్రామం. ఇది కొండలతో కూడి అధిక జనాభా సాంద్రత, చిన్న వ్యవసాయ కమతాలు కలిగిన అందమైన ప్రదేశం. అనేక దశాబ్దాలుగా ఇక్కడ వ్యవసాయం ప్రధాన జీవనోపాధిగా లేదు. అయితే క్రియాశీలమైన పరిపాలనా వికేంద్రీకరణ, మహిళా స్వయం సహాయక బృందాల ఏర్పాటు, సురక్షితమైన ఆహారం గురించిన అవగాహన పెరగటం, గాంధీ స్మారక నిధి, తనల్, వెంగనూర్ గ్రామా పంచాయతీ మొదలైన సంస్థలు సేంద్రియ వ్యవసాయం పై ఇచ్చిన శిక్షణలు వంటివి ఇక్కడి ప్రజల ఆలోచనా విధానాన్ని గణనీయంగా మార్చాయి. చిన్న కమతాలు గలవారు అనేకమంది తమ భూమిలో కూరగాయలు, అరటిపండ్లు, బొప్పాయి, కంద వంటి పంటలు సాగు చేయటం

ఫోటో: తనల్




మహిళా సంఘం నుండి విత్తనా లను అందుకుంటున్న మహిళా రైతు

మొదలుపెట్టారు. తనల్ ద్వారా శిక్షణ పొందిన 70 మంది రైతులు గత రెండు ఏళ్లలో చురుకుగా వ్యవసాయం మొదలుపెట్టి తమ స్వంత వినియోగానికి, మార్కెట్ లో అమ్మటానికి కూడా సేంద్రియ కూరగాయలు పండించటం మొదలుపెట్టారు. వారిలో ఎక్కువ మంది మహిళా రైతులు. మొదట్లో వారు కుటుంబ శ్రమను వినియోగించి వ్యవసాయం చేశారు కానీ తర్వాత చిన్న బృందాలుగా ఏర్పడి కలసి సాగు చేయటం మొదలుపెట్టారు.

2018 లో శ్రీలక్ష్మి మహిళా సంఘం 15 మంది మహిళా రైతులతో ఏర్పడింది ( వారి వయసు 35 - 70 వరకు ఉంటుంది). వారు కూరగాయల సాగు, మార్కెటింగ్ చేయటంలో చాలా క్రియాశీలంగా పనిచేస్తున్నారు. ఈ సంఘం సభ్యులు 3.5 ఎకరాలను కలసి సాగుచేస్తున్నారు. వాళ్లు ఇప్పుడు విత్తనాలు, సేంద్రియ ఉత్పాదకాల విషయంలో స్వయం సమృద్ధిగా తయారయ్యారు. లాక్ డౌన్ సమయంలో వారు మార్కెటింగ్ విషయంలో అనేక సమస్యలను ఎదుర్కొన్నారు. వారు పనికి వెళ్లలేకపోవటంతో వారి కుటుంబాలు ఆదాయాన్ని కోల్పోయాయి. ఈ ప్రాంతంలో చాలా మంది కోవళం పర్యాటక కేంద్రం చుట్టూ హొటళ్లలో, దుకాణాలు, రవాణా సంస్థలలో రోజు కూలీలుగా పనిచేస్తారు. కోవిడ్ కారణంగా అవన్నీ మూతపడ్డాయి. ప్రభుత్వం కొంతవరకు ఆహారం వంటి మౌలిక అవసర వస్తువులను తక్షణ సహాయంగా అందించింది. కానీ కుటుంబాలు ఆర్థికంగా చాలా చితికిపోయాయి. లాక్ డౌన్ సమయంలో ప్రభుత్వం సత్వరమే స్పందించి రాష్ట్రంలోని లక్షలాది వలస కార్మికులకు ఆహారం, నివాస సౌకర్యం కల్పించింది. పంచాయతీలు సామూహిక వంటశాలలను ప్రారంభించి స్థానిక బృందాలు, వ్యాపార సంస్థలు, కుటుంబాలు, కుటుంబశ్రీ బృందాల ద్వారా సహాయం అందించటంలో కీలక పాత్ర పోషించాయి. ఈ మొత్తం ప్రక్రియ తమ ఉత్పత్తులను అమ్ముకోలేక ఇబ్బందులు పడుతున్న వారికి అమ్ముకోవటానికి, ఇతరులతో పంచుకోవటానికి సాహాయపడింది. ఈ సామూహిక వంటశాలలు ఒంటరిగా ఉంటున్న వృద్ధులు, జబ్బుపడినవారు, ఆహారం కోసం హొటళ్లపై ఆధారపడుతున్నవారికి కూడా చాలా సహాయపడ్డాయి.

లాక్ డౌన్ సమయంలో రవాణా సౌకర్యం లేకపోవటంతో మహిళా రైతులు తాము పండించిన కూరగాయలను అమ్ముకోవటానికి మార్కెట్ కి వెళ్లలేకపోయారు. అప్పుడు శ్రీ లక్ష్మి సంఘం సభ్యులు తమ చుట్టుపక్కల వున్న కుటుంబాలకు కూరగాయలు అందుబాటులో లేవు అనే విషయాన్ని గ్రహించి, అటువంటి వారిని టెలిఫోన్ ద్వారా, తమ వార్డు సభ్యుల ద్వారా గుర్తించారు. మొదట్లో 25 కుటుంబాలకు కూరగాయలను అందించటంతో ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా శ్రీ లక్ష్మి సంఘం 90 మందికి వివిధ రకాల కూరగాయలను తమ స్వంత భూములలో పండిన వాటిని అందించగలిగింది, ఇది వారికి చాలా సంతృప్తినిచ్చింది. ఆ సమయంలో వర్షాలు అప్పుడప్పుడు రావటం, మంచి ఎండలు కాయటంతో వాతావరణం అనుకూలంగా వుండి కూరగాయల ఉత్పత్తి కూడా పెరిగింది. ముఖ్యంగా మహిళలకు ఇతర పనులేమీ లేని

పరిస్థితిలో తమ పంటలను రక్షించుకోవటానికి సమయం దొరికింది. త్రివేంద్రంలో తనల్ ప్రారంభించిన ఆర్గానిక్ బజార్ లాక్ డౌన్ సమయంలో సేంద్రియ రైతులందరికీ ఫోన్ లు చేసి వారి సమస్యలను కనుక్కున్నది. వారికి మార్కెటింగ్ సమస్య ఉందని తెలుసుకుని ఆర్గానిక్ బజార్ వారి కూరగాయలను వారి పొలాల నుండే సేకరించటానికి ముందుకొచ్చింది. ఇది మహిళా గ్రూపుకు చాలా ఉపకరించింది. చాలా మంది చిన్న సన్నకారు రైతులు శ్రీ లక్ష్మి మహిళా గ్రూపు నుండి కూరగాయల విత్తనాలను తీసుకుని కూరగాయలు పండించటంలో ఇది ప్రోత్సహాన్నిచ్చింది. ఈ మహిళలు రిసోర్స్ బృందంగా ఏర్పడి కొత్త సభ్యులు సేంద్రియ పద్ధతిలో కూరగాయలు పండించటానికి సహాయపడ్డారు.

కోవిడ్ విపత్తు ఆహార ఉత్పత్తి పై పెద్ద చర్చ జరగటానికి కారణమైంది, ప్రభుత్వం కూడా కూరగాయలు, దుంపలు, పండ్ల ఉత్పత్తిని పెంచటానికి నిర్ణయించింది. వ్యవసాయ శాఖ, కుటుంబశ్రీ మిషన్ కూడా విత్తనాల పంపిణి మొదలుపెట్టాయి. శ్రీలక్ష్మి సంఘం సభ్యులు కూడా కుటుంబశ్రీ నుండి కొంత సహాయం పొందారు. ఈ అనుభవం నుండి రెండు కీలకమైన పాఠాలను నేర్చుకున్నారు, ఒకటి స్థానిక సంస్థల ద్వారా ఆహారాన్ని పండించాల్సిన అవసరాన్ని గుర్తించారు, రెండు ఆ ఉత్పత్తులను మార్కెటింగ్ చేయటానికి స్థానిక వ్యవస్థలను ఏర్పరచుకోవటము అన్ని విధాలుగా ఉపయోగకరంగా ఉంటుంది అనేది..

ఫోటో :తనల్



తన పెరటి తోటలో చంద్రిక అమ్మ

# 5. కోవిడ్ విపత్తు సమయంలో కోర్చిమహాగ్రామసభ వినూత్న కృషి

**రచయితలు**: కుమారిబాయి జమ్కటన్, కోర్చి జిల్లా, గడ్చిరోలి

ఫోటో: ఒమితా బవాంకర్



పెరటి తోటలు, సేంద్రియ వ్యవసాయం , ద్వితీయ ఉత్పత్తులు, ప్రభుత్వ ధరలు, స్థానిక విత్తనాలు, నాటువేయటం మొదలైన వ్యవసాయ అంశాలపై ఖరీఫ్ సీజన్ లో మహిళా నాయకులకు మార్గదర్శకంగా తయారుచేసిన పోస్టర్లు

## అమీ ఆమ్చా ఆరోగ్య సాథీ (AAA) గురించి

అమీ ఆమ్చా ఆరోగ్య సాథీ అనేది ఒక ప్రభుత్వేతర సంస్థ, దానిని 1984లో ప్రారంభించారు. 1970లలో జయప్రకాశ్ నారాయణ్ ప్రారంభించిన సంపూర్ణ విప్లవ ఆందోళన నుండి ఈ సంస్థ ఉద్భవించింది. ఈ సంస్థ ప్రజాసమూహాలలో స్వావలంబన, సాధికారత నిర్మించటంలో ముఖ్యపాత్ర వహిస్తుంది, అది ఎటువంటి “ఇజాల”కు కఠోరంగా కట్టుబడి ఉండకుండా సామాజిక మార్పుకోసం గ్రామీణ సమూహాలకు సహాయపడుతుంది. ఈ సంస్థ రెడీమేడ్ పరిష్కారాలను సూచించటం కాకుండా ప్రజలు తమ స్వంత పరిష్కారాలను వెతుక్కునే విధంగా సహకరిస్తుంది. అమీ ఆమ్చా ఆరోగ్య సాథీ వ్యవస్థాపక సభ్యులు నెలకొల్పిన స్వయం సహాయక ఉద్యమ విలువలతో గడ్చిరోలి జిల్లాలో అనేక ప్రజా సంఘాలను నిర్మించింది, వాటిలో స్వయం సహాయక బృందాల సమాఖ్యలు, క్రాంతిజ్యోతి మహిళా సంఘం, జనకల్యాణ్ అపాంగ్జన సంఘం , మహాగ్రామసభ (కోర్చి బ్లాక్ స్థాయిలో) వంటివి వున్నాయి. మహాగ్రామసభ అనేది రిజిస్టర్ చేయని స్వయంప్రతిపత్తి గల సంస్థ, ఇది రాజ్యాంగబద్ధంగా ఏర్పడ్డ గ్రామసభల కలయికతో ఏర్పడిన అనధికార వేదిక.

కోర్చి బ్లాక్ లో మహాగ్రామసభలో 80 గ్రామసభల సభ్యత్వం వుంది. గ్రామసభల పరిపాలనను అన్ని రంగాలలో ప్రజాస్వామీకరించే ఉద్దేశంతో దీని నిర్మాణం జరిగింది. కోర్చి మహాగ్రామసభ అటవీ హక్కుల గుర్తింపు చట్టం అమలు, ప్రభుత్వ ప్రాజెక్టుల కోసం జరుగుతున్న భూసేకరణకు(అంతర్రాష్ట్ర విద్యుత్ సరఫరాలైన్, ఇనుప ఖనిజం తవ్వకాలు) వ్యతిరేకంగా పోరాటం, తునికి ఆకు సేకరణ కోసం కార్యక్రమాలు మొదలైనవి చేపడుతూ వచ్చింది. ఇటీవల గడ్చిరోలి జిల్లాలోని ఎట్టపల్లి బ్లాక్ లో వరదబారిన పడిన ప్రజలకు సహాయాన్ని కూడా అందించింది. అమీ ఆమ్చా ఆరోగ్య సాథీ ఈ ప్రజా సంఘాలను జిల్లా వ్యాప్తంగా నిర్మించటంలో ప్రధాన పాత్ర వహిస్తున్నది. కోవిడ్ లాక్ డౌన్ సమయంలో గ్రామసభలు ముందుకొచ్చి అవసరంలో వున్న ప్రజలకి ఆహారం, నిత్యావసర సరుకులు అందించాయి . .

ఫోటో: ఒమితా బవాంకర్




మహిళా సంఘం సభ్యులతో మాట్లాడుతున్న కుమారిబాయి

## గ్రామసభల కృషి

కోవిడ్ విపత్తు ప్రపంచవ్యాప్తంగా తీవ్ర నష్టాన్ని కలిగించి ప్రజల బ్రతుకులను దుర్భరం చేసింది. పనిచేసే వారికి ఉపాధి హామీ లేకుండా పోయింది, అటవీ ఉత్పత్తులను సేకరించే అవకాశం లేకుండా పోయింది, ఉత్పత్తులను అమ్ముకునే అవకాశం లేకుండా పోయింది. అటువంటి పరిస్థితులలో కోర్చి తాలూకాలోని గ్రామసభల నాయకులు కలసికట్టుగా ముందుకొచ్చి కోవిడ్ కారణంగా ఇబ్బందులు పడుతున్నవారికి గ్రామసభ నిధులనుండి నిత్యావసర సరుకులను అందించాలని నిర్ణయించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల అవసరాలను తెలుసుకుని సరుకుల జాబితా తయారు చేశారు. గ్రామసభ సమావేశంలో ఒక అధికారిక తీర్మానం చేసి ప్రతి గ్రామంలో ఒక కార్యక్రమం జరిగేటట్లు చేశారు. ఒంటరి మహిళలు, వికలాంగులకు ప్రాధాన్యత ఇచ్చి ముందు వారికి నిత్యావసర సరుకులు అందించారు. మాస్కులు ధరించటం, శానిటైజర్లను వాడటం, భౌతిక దూరం పాటించటం వంటి అన్ని జాగ్రత్తలు తీసుకుని గహనేగాట, సాల్హే, జాన్కార్ గోండి, కుక్డేల్ గ్రామాలలో ఆహార పదార్థాలతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. ఆ కిట్లలో బియ్యం, పప్పు, ఎండు మిర్చి,, ఉప్పు, నూనె, ఆలుగడ్డలు, ఉల్లిగడ్డలు, సబ్బులు, చక్కెర, టీ పొడి చేర్చారు. మహిళా రైతుల హక్కుల వేదిక (మకాం), అమీ ఆమ్చా ఆరోగ్య సాథీ తదితర సంస్థలు ఒంటరి మహిళలకు నిత్యావసర సరుకులతో పాటు వ్యవసాయానికి విత్తనాలు, సేంద్రియ ఎరువులు, పెరటి తోటలను పెంచటానికి విత్తనాలను అందించాయి.

కుక్డేల్ గ్రామ సభ ప్రజలకు ఉపాధి కల్పించాలని ప్రణాళిక వేసి ఉమ్మడి భూములలో మొక్కలు నాటించింది. ఇందుకోసం విద్యుత్ టవర్ లైన్ ఏర్పాటు వల్ల జరిగిన నష్టానికి పరిహారంగా గ్రామసభకు అందిన డబ్బును ఈ పనికోసం ఖర్చు చేశారు. 110 కుటుంబాలకు చెందిన వారు ఒకొక్కరు 50 గుంతలు తవ్వారు, వారికి రోజుకి 250రూ. వేతనాలుగా చెల్లించారు.

## వికేంద్రీకరించిన నిర్ణయాధికారం లో ఎదురైన అడ్డంకులు

మహాగ్రామసభలు ఈ ఆదర్శప్రాయమైన పని చేస్తున్నప్పుడే జిల్లా కలెక్టర్ ఏకపక్షంగా గ్రామసభల బ్యాంకు అకౌంట్ లను మూసివేయించాడు, గ్రామసభలు చొరవతీసుకుని చేస్తున్న ఈ .సహాయ కార్యక్రమాలలో అవకతవకలున్నాయని కారణం చెప్పారు. జిల్లా కలెక్టర్ తీసుకున్న ఈ చర్యల ఫలితంగా ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు.

ఆ సమయంలో ఈ మొత్తం సహాయ కార్యక్రమానికి మార్గదర్శకత్వం వహిస్తున్న అమీ ఆమ్చా ఆరోగ్య సాథీ మరియు కోర్చి తాలూకా మహాగ్రామసభ కలసి గ్రామసభల రికార్డులలో సమాచారాన్ని, గణాంకాలను చేర్చి అవసరమైన నివేదికను తయారుచేయడంలో ప్రభుత్వానికి సహాయపడ్డాయి. అయితే జిల్లా కలెక్టర్ ఈ అకౌంట్లను గుర్తించటానికి నిరాకరించాడు. అదేవిధంగా అటవీ హక్కుల గుర్తింపు చట్టం, పీసా చట్టం కింద ఏర్పడిన అటవీ హక్కుల కమిటీకి అటవీహక్కుల పర్యవేక్షణ కమిటీ బ్యాంక్ అకౌంట్లకు గ్రామసేవక్ సంతకం చేసే వ్యక్తిగా ఉండటానికి నిరాకరించారు. సహాయ కార్యక్రమాలను ఆపకపోతే గ్రామసభ అకౌంట్ లో వున్న డబ్బును కోష్ సమితి అకౌంట్ కు బదిలీచేస్తామని బెదిరించారు. కోర్చి,, కుర్ఖేడ తాలూకాలకు చెందిన 19 గ్రామసభలు కలసి తమస్వంత

ఖర్చులతో కోర్టులో కేసు వేసిన తర్వాత మాత్రమే గ్రామసభ బ్యాంక్ అకౌంట్ ను తాత్కాలికంగా తెరిచారు, ఆ తర్వాతనే తునికి ఆకు తదితర కలిపేతర అటవీ ఉత్పత్తుల నుండి వచ్చిన డబ్బు నుండి వేతనాలను రాయల్టీలను పంపిణి చేయటం సాధ్యపడింది. అయితే హైకోర్టులో ఈ కేసు ఇప్పటికీ పెండింగ్ లో ఉండటం వల్ల నష్టపరిహారంగా అందిన మొత్తాన్ని ఇప్పటికీ ఉపయోగించటానికి అనుమతి ఇవ్వలేదు.

మహాగ్రామసభ జిల్లా అధికారుల ఆగ్రహానికి గురైనప్పటికీ ఈ మొత్తం సహాయ కార్యక్రమాల ప్రక్రియ చేపట్టిన తర్వాత అది మరింత బలపడింది.

# 6. మార్పువైపు ప్రయాణిస్తూ సంక్షోభాన్ని దాటటానికి ప్రకృతి వ్యవసాయ పద్ధతుల అనుసరణ - హెచ్ డి ఆర్ సి కథ

**రచయితలు**: ఆరిఫ్ మీర్జా, రాజేష్ లాకుమ్, సునీత మెండోజా

ఫోటో కమలాబెన్ ఎస్ సమీర్



క్షేత్రంలో - "డోలారియా చనా" నల్ల సెనగలు, ఆరావళి జిల్లా , మేఘ్ రాజ్ బ్లాక్ లోని నవఘరా గ్రామంలో జయబెన్ బి దామోర్

హ్యూమన్ డెవలప్మెంట్ రిసర్చి సెంటర్ (హెచ్ డి ఆర్ సి) అనేది గుజరాత్ లో దళిత హక్కుల ఉద్యమంలోను , అణగారిన వర్గాల మహిళల సాధికారత, పిల్లల హక్కులు, భూమి హక్కులు, అటవీ హక్కులు, సుస్థిర నివాస హక్కులు, ఆరోగ్యం, విద్య, జీవనోపాధి కార్యక్రమాలలో గత 5 దశాబ్దాలుగా పనిచేస్తున్నది. ఈ సంస్థ హక్కుల ప్రాతిపదిక ద్వారా పేదరికంలో వున్న ఈ అణగారిన వర్గాలను మినహాయించటాన్ని అంతం చేయటమే లక్ష్యంగా పెట్టుకున్నది. రాజ్యాంగంలో, చట్టాలలో పొందుపరిచిన అంశాల గురించి తెలుసుకుని, హక్కులు కావాలని అడిగే విధంగా అణగారిన సమూహాలకు సాధికారతను కల్పించటం, ఆ విధంగా పేదల హక్కులను గౌరవించి, సంరక్షించి, పరిపూర్తి చేసేందుకు వ్యక్తుల, సంస్థల సామర్ధ్యాలను పెంచటం హెచ్ డి ఆర్సి లక్ష్యంగా పెట్టుకుంది. హెచ్ డి ఆర్ సి చేపట్టే కార్యక్రమాల ద్వారా స్థానిక ప్రజాసమూహాలు ఏర్పరచుకున్న ప్రజా సంఘాలను బలోపేతం చేసి అటువంటి కార్యక్రమాలను స్వంతం చేసుకుని ఆ సంఘాలు తామే నిర్వహించుకునే విధంగా వాటి శక్తి సామర్ధ్యాలను పెంపొందిస్తుంది. ప్రస్తుతం హెచ్ డి ఆర్ సి గుజరాత్ లోని గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో 11 జిల్లాలలోని 27 తాలూకాలలో అణగారిన సమూహాలతో విరామం లేకుండా పనిచేస్తున్నది.

కోవిడ్ విపత్తు నేపథ్యంలో కొరోనా వ్యాధి వ్యాపించకుండా నివారించటానికి భారత ప్రభుత్వం 2020 మార్చ్ 24వ తేదీన దేశవ్యాప్త లాక్ డౌన్ విధించింది. ఎటువంటి ప్రణాళిక లేకుండా అకస్మాత్తుగా దేశం మొత్తాన్ని మూడువారాలపాటు మూసివేయటంతో లక్షలాది మందిపేద ప్రజలు తిండి లేక బ్రతకటానికి అవసరమైన కనీస సరుకులు లేక జీవనోపాధులు కోల్పోయే పరిస్థితిలోకి నెట్టివేసింది. దీని ఫలితంగా అణగారిన, దుర్బల స్థితిలో వున్న సమూహాలు పెద్ద ఎత్తున కష్టాల పాలయ్యారు.లక్షలాది మంది వలస కార్మికులు, రోజుకూలీ పనిచేసే కూలీలు, చిరు వ్యాపారస్తులు, వృద్ధులు ఈ ఆకస్మిక లాక్ డౌన్ కారణంగా తీవ్రంగా ప్రభావితులయ్యారు. ఆ తర్వాత లాక్ డౌన్ ను పొడిగించటం, కొరోనా వ్యాపించటంతో, సాధారణంగా ఎటువంటి విపత్తులు వచ్చినా అందరికంటే

ఎక్కువగా నష్టపోయే ఈ అణగారిన వర్గాల ప్రజలలో కొరోనా పరిస్థితులవల్ల కలిగే దీర్ఘకాలిక ప్రభావాల గురించి ఆందోళన పెరిగింది.

వీరితో పాటు రైతులు కూడా పెద్ద ఎత్తున లాక్ డౌన్ ప్రతికూల ప్రభావాలను తీవ్రంగా ఎదుర్కొన్నారు. రైతులు తమ స్వంత పొలాలలోకి వెళ్లి వ్యవసాయ పనులు చేసుకోలేక పోయారు, దానితో వారి పంట దిగుబడి దెబ్బతిన్నది , కొన్ని గ్రామాలలో రైతులు తమ పంటల సంరక్షణ చేసుకోలేపోవటంతో పంట మొత్తం నాశనమైంది. ప్రత్యేకించి మహిళా రైతుల పరిస్థితి మరింత అగమ్యగోచరమైంది. ఈ దారుణమైన పరిస్థితిని గుర్తించి హెచ్ డి ఆర్ సి సత్వర సహాయాన్ని అందించింది. అదే సమయంలో మహిళా రైతుల బృందాల పరిస్థితిని ఈ సంస్థ సమీక్షించింది. విశ్వశనీయమైన సమాచార సేకరణ ద్వారా మహిళా రైతులకు సీజన్ మొత్తం ఎటువంటి పని దొరకక వృధా అయిందనీ, వారికి ఎటువంటి ఆదాయము, ఆహారము లేదని తెలిసింది.

ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ఆరావళి జిల్లా లోని మేఘరాజ్ తాలూకా లో 10 గ్రామాలలో ఇబ్బందులలో వున్న మహిళా రైతులను గుర్తించారు. తక్షణ సహాయంగా వారికి హెచ్ డి ఆర్ సి ఆహార పదార్ధాలతో కూడిన రేషన్ కిట్ లను అందించింది. మొత్తం 280 రేషన్ కిట్లను పంపిణి చేశారు, ఒకొక్క కిట్ లో ఒక చిన్న కుటుంబానికి 15 రోజుల పాటు సరిపోయే ఆహార సరుకులు చేర్చి పంపిణి చేశారు. లాక్ డౌన్ కారణంగా ఈ మహిళలు బయటికి వెళ్లి పనులు చేసుకోలేకపోయారు, తినటానికి వారికి చేతిలో డబ్బు కూడా లేదు. అటువంటి సమయంలో హెచ్ డి ఆర్ సి అందించిన రేషన్ కిట్లు దుర్భర స్థితిలో వున్న ఈ కుటుంబాలలోని మహిళలు తమ కుటుంబాలకు తిండి పెట్టటానికి ఎంతగానో సహాయ పడ్డాయి.

ఈ సహాయ కార్యక్రమాలు జరిగే క్రమంలో మహిళా రైతులు వారి వ్యవసాయాన్ని కొనసాగించేందుకు విత్తనాలు, సేంద్రియ ఎరువులు ఇచ్చి సహాయపడాలని కోరారు. వారి కోరిక మేరకు హెచ్ డి ఆర్ సి, వర్కింగ్ గ్రూప్ ఫర్ విమెన్ లాండ్ ఓనర్షిప్ (WGWLO) కలసి వారి పరిస్థితిని మెరుగుపరచటానికి సహాయం అందించాలని నిర్ణయించాయి. 300 మహిళా రైతులకు నాణ్యమైన విత్తనాలు, సేంద్రియ ఎరువులను అందించటం ద్వారా లాక్ డౌన్ కారణంగా నష్టపోయిన వారి వ్యవసాయాన్ని తిరిగి ప్రారంభించి స్వయం సమృద్ధిగా తయారవటానికి సహాయపడింది. వారికి అందించిన విత్తనాలలో మక్కజొన్న, సెనగ, మినుము, పెసర తో పాటు బెండ, సొర, గుమ్మడి వంటి కూరగాయ విత్తనాలు కూడా వారి పెరటి తోటల కోసం పంపిణి చేశారు. ఈ సహాయ చర్యలలో భాగంగా 10 గ్రామాలకు

ఫోటో కమలాబెన్ ఎస్ సమీర్









(ఎడమనుండి ) "టుక్డి గేహు " అనే గోధుమ, భావన బెన్ ఎస్ వర్సాత్ , ఆరావళి జిల్లాలోని మేఘ్ రాజ్ బ్లాక్ లో పహాడియా గ్రామం; ఆరావళి జిల్లా మేఘ్ రాజ్ బ్లాక్ లో వలున గ్రామంలో "టుక్డి గేహు"రకం గోధుమ చేనులో సుమిత్ర బెన్ ఎస్ ఖాంత్ ; ఆరావళి జిల్లా , మేఘ్ రాజ్ బ్లాక్ లో వలున గ్రామంలో దేశవాళీ ఆవ విత్తనాలు నాటిన మంజుల బెన్ ఆర్ ఖాంత్ ; "డోలారియా చనా" అనే నల్ల సెనగ పంట తో వలున గ్రామంలో భానుబెన్ ఎం ఖాంత్

చెందిన ఆదివాసీ మహిళలకు సేంద్రియ ఎరువులు, సేంద్రియ పురుగుమందులు తయారు చేయటంలో శిక్షణ ఇచ్చారు, దీని ఫలితంగా వారికి పంటల సాగులో ఖర్చు తగ్గింది .

ఈ సహాయ కార్యక్రమం ప్రారంభంలో రేషన్ కిట్లు పంపిణి చేస్తున్నప్పుడు చాలా మంది మహిళలు అవి తీసుకోవటానికి భయపడ్డారు. ఆ కిట్లలో కోవిడ్ ఇన్ఫెక్షన్ ఉండవచ్చని కొంత మంది వాటిని తీసుకోవటానికి నిరాకరించారు. అటువంటి మహిళలకు, ఇతర ప్రజలకు హెచ్ డి ఆర్ సి ఆలోచన గురించి కోవిడ్ వ్యాపించకుండా తీసుకున్న జాగ్రత్తలగురించి గ్రామ పెద్దలు విపులంగా వివరించి చెప్పారు, రేషన్ కిట్లను ప్యాకెట్లు గా తయారుచేసేటప్పుడు వాటిని శానిటైజ్ చేసి పంపిణి చేస్తున్నట్లు వివరించి వారిలో భయాన్ని పోగొట్టారు.

ఈ రేషన్ కిట్లలో 15 రోజులకు సరిపడినంత ఆహారపదార్థాలే వున్నప్పటికి వాటిని తీసుకున్న మహిళలు వాటిని పొదుపుగా వాడుకుని ఆకష్టకాలమంతా వాటిని వినియోగించుకున్నారు. కొంతమంది వాటిని నెలరోజుల పాటు వాడుకున్నారు, ఎందుకంటే ఇదొక్కటే వారికి ఆ దుస్థితిలో బ్రతికి బయటపడటానికి ఏకైక వనరుగా లభించింది. వారికి అందించిన విత్తనాలు తర్వాత ఖరీఫ్ సీజన్లో వ్యవసాయాన్ని కాపాడాయి.

ఫోటో కమలాబెన్ ఎస్ సమీర్







(ఎడమ ) ఎస్ ఐ ఆర్ పద్ధతిలో “టుక్షి గేహు” రకం గోధుమ; (మధ్యలో) సెజల్ బెన్ ఎం ఖాంత్ పెరటి తోటలో పండిన వివిధ రకాల వంకాయలు, మిరపకాయలు ; (కుడివైపు ) పహాడియా గ్రామంలో మేఘ్ రాజ్ విత్తన బ్యాంకు నుండి పంపిణి చేసిన ఎర్ర మక్కజొన్న విత్తనాలు .

# 7. కోవిడ్ సంక్షోభానికి స్పందనగా మహిళా రైతులు ఆహార - వ్యవసాయ భద్రతకు వ్యవస్థల నిర్మాణం

**రచయిత**: డబ్ల్యు జి డబ్ల్యు ఎల్ ఓ

ఫోటో డబ్ల్యు జి డబ్ల్యు ఎల్ ఓ



మహిళా కిసాన్ సఖి, కాజల్ మహిళా రైతులతో ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆహార భద్రతపై సమాచారాన్ని పంచుకోవటం - సమర్థన్ మహిళా వికాస్ సంఘటన, గోఘా , భావనగర్

వర్కింగ్ గ్రూప్ ఫర్ విమెన్ లాండ్ ఓనర్షిప్ (WGWLO) అనే మహిళల భూమి హక్కులకోసం పనిచేసే సంస్థ అనేక స్వచ్ఛంద సంస్థలు, ప్రజాసంఘాలతో కూడిన రిజిస్టర్ చేయని వేదిక. ఈ సంస్థ 2002 నుండి గుజరాత్ లో మహిళలకు భూమి హక్కులను కలిగించే విషయమై పనిచేస్తున్నది. గత 18 ఏళ్లుగా ఈ వేదిక మహిళల భూమి హక్కులతో పాటు, మహిళలకు రైతులుగా గుర్తింపు, వారికి ఉత్పాదక వనరుల అందుబాటు, వాటిపై హక్కులను కల్పించటంలో ముందడుగు వేసింది. డబ్ల్యూ జి డబ్ల్యూ ఎల్ ఓ గ్రామ స్థాయిలో పారా లీగల్ (న్యాయపరమైన అంశాలపై పనిచేసే) కార్యకర్తలను తయారుచేయటం, స్వభూమి కేంద్రాలు అనే పేరుతో తాలూకా స్థాయిలో సమాచారము, శిక్షణ ఇచ్చే కేంద్రాలను నడపడం వంటి అనేక వినూత్న వ్యూహాలు, నమూనాలను ఏర్పరచింది. వాటి నుండి నేర్చుకున్న అంశాలను ఇతర సంస్థలతోను ప్రభుత్వంతోను పంచుకుంటుంది. స్వభూమి కేంద్రాలు, గ్రామ స్థాయి పారాలీగల్ కార్యకర్తలు, మహిళా రైతులకు తోడ్పడే మహిళా కిసాన్ సఖి వంటి వ్యవస్థలు గుజరాత్ లోని 11 జిల్లాలలో 15 తాలూకాలలోని 225 గ్రామాలలో ఆదివాసీ, పశుపెంపక దారుల, అణగారిన సెక్షన్లకు చెందిన మహిళా రైతులతో పనిచేస్తున్నాయి.

కోవిడ్ విపత్తుతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థలు, గ్రామీణ ప్రజలు జీవనోపాధులు తీవ్రంగా దెబ్బతిన్నాయి, వారు ఇప్పుడిప్పుడే నెమ్మదిగా కోలుకుంటూ జీవనోపాధులను పునరుద్ధరించుకునే క్రమంలో వున్నారు. భూమి వంటి ఉత్పాదక వనరులకు, వ్యవసాయ ఉత్పాదకాలకు, రుణ సదుపాయం, సమాచారం, ప్రభుత్వ పథకాల అందుబాటు వంటివి చాలా తక్కువగా అందుబాటులో వున్న మహిళా రైతులకు రాబోయే వ్యవసాయ సీజన్ లో పంటలను సాగు చేయటం ఎట్లా అనే ఒత్తిడిని ఏర్పడింది, కుటుంబాల రోజు వారీ అవసరాలను తీర్చటం పెద్ద సవాలుగా నిలిచింది.

ఇటువంటి గడ్డు సమయంలో మహిళా రైతుల పరిస్థితి గురించి డబ్ల్యూ జి డబ్ల్యూ ఎల్ ఓ సంస్థ బాధ్యులు తమ సభ్యులను అడిగి తెలుసుకున్నప్పుడు దాదాపు 90% మంది మహిళా

ఫోటో డబ్ల్యు జి డబ్ల్యు ఎల్ ఓ



మహిళా కిసాన్ సఖి, కనక్ ఖరీఫ్ సీజన్ లో మహిళా రైతులకు విత్తనాల కిట్ లను పంపిణీ చేయటం - స్వాతి, పాటాడి, సురేంద్రనగర్

రైతులకు వారి రబి పంట అమ్మకాలలో నష్టం వచ్చినట్లు కనుగొన్నారు. దక్షిణ గుజరాత్ లోని టాపి జిల్లాలో కూరగాయలు పండించే రైతులు, కూరగాయల ద్వారా కొరోనా వైరస్ వ్యాపిస్తుంది అనే పుకార్లు పుట్టటంతో ప్రజలు కూరగాయల పంటలను నాశనం చేస్తున్నట్లు చెప్పారు. అదే మహిళా రైతులు ఖరీఫ్ సీజన్ కోసం విత్తనాలను అప్పుగా తెచ్చుకుని, ఇంటికి అవసరమైన ఆహార పదార్ధాలు తదితర నిత్యావసర వస్తువలను కొనుగోలు చేయటానికి అప్పులు చేయవలసి వచ్చింది. బయటికి ప్రాంతాలకు వలసపోయిన వారు తిరిగి గ్రామాలకు రావటంతో అనేక కుటుంబాలు తిండి సరిపోక ఖరీఫ్ సీజన్ కోసం దాచుకున్న ధాన్యం విత్తనాలను కూడా తినవలసి వచ్చిందని సురేందర్ నగర్ లోని పాట్డి కి చెందిన వసంతిబెన్ లఖ్జిభాయి చెప్పింది.

రాబోయే వ్యవసాయ సీజన్ లో మహిళా రైతులు తమకు ఎదురయ్యే సవాళ్ళపై చేస్తున్న పోరాటం చూసినప్పుడు డబ్ల్యూ జి డబ్ల్యూ ఎల్ ఓ సభ్యులు వారికి సహాయపడే కార్యక్రమాలను చేపట్టాల్సిన అవసరం ఉందని గుర్తించారు. మహిళా రైతులకు అనుకూలమైన పద్ధతులను ప్రవేశపెట్టటం ద్వారా వారు సుస్థిర వ్యవసాయము, ప్రకృతి వ్యవసాయ పద్ధతులవైపు నిర్ణయాత్మక మలుపు తీసుకునేటట్లు వారిని ప్రోత్సహించారు.

ఇందుకోసం డబ్ల్యూ జి డబ్ల్యూ ఎల్ ఓ సభ్యులు వివిధ స్థాయిలలో వరుసగా అనేక కార్యక్రమాలను చేపట్టారు. ముందుగా ఖరీఫ్ సీజన్ లో మహిళా రైతుల సమస్యలు, అవసరాల గురించి సంస్థ సభ్యులందరితో అవగాహన కల్పించి ఈ అవగాహనను మహిళా సమాఖ్యలు, పారా లీగల్ కార్యకర్తలు, మహిళా కిసాన్ సఖిల ద్వారా మహిళా రైతులకు చేరవేశారు. వాట్సాప్ , టాబ్లెట్స్ ద్వారా ఆడియో, వీడియో సందేశాలు, ఆన్లైన్ సమావేశాలు నిర్వహించటం వంటి సాంకేతిక పద్ధతులు మహిళా రైతులతో సంబంధాలు ఏర్పరచుకోవటంలో కీలక పాత్ర వహించాయి. డబ్ల్యూ జి డబ్ల్యూ ఎల్ ఓ సభ్యులుగా వున్న స్థానిక మహిళా సమాఖ్యలు, తాలూకా స్థాయి కార్యకర్తలు వారి ప్రాంతాలలో మహిళా రైతులతో ఈ కార్యక్రమాన్ని అమలు పరచటంలో ముందు నిలిచారు.

మహిళా కిసాన్ సఖి లు వ్యవసాయ పద్ధతుల గురించి 15000 కంటే ఎక్కువ మహిళా రైతులకు సందేశాలను చేరవేశారు. వారు పెరటి తోటల పెంపకం, స్థానికంగా అందుబాటులో వుండే వనరులతో వ్యవసాయ చేయటం, పంటలను, పంటల సాగు పద్ధతులలో వైవిధ్యం తీసుకురావటం గురించి సందేశాలు చేరవేశారు. అలాగే దీర్ఘకాలం ఆహార భద్రతను పెంపొందించి భూమికి ప్రయోజనం కలిగించే పంటలను పండించాలని ప్రోత్సహించారు, ఇందుకోసం హైబ్రిడ్ విత్తనాలు కాకుండా స్థానిక విత్తనాలను ఉపయోగించాలని ప్రచారం చేశారు. ఆహ్వా అనే మారుమూల గ్రామంలో నివసించే మీరాబెన్ పథియర్ ప్రకృతి వ్యవసాయం గురించిన ఆడియో సందేశం చాలా వినూత్నంగా ఉన్నట్లు చెప్పింది, “ మేము ఎక్కడికి వెళ్లకుండా ఇంటివద్దనే సహజ ఎరువులను ఎట్లా తయారుచేసుకోవాలో ఉపయోగకరమైన సమాచారాన్ని అందుకుంటున్నాము” అని ఆమె చెప్పింది.

ఖరీఫ్ సీజన్ లో వ్యవసాయానికి అవసరమైన ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు వంటివి కొనుగోలు చేయటానికి పెట్టుబడి లేదని మహిళా రైతులు వ్యక్తం చేయటంతో డబ్ల్యూ జి డబ్ల్యూ ఎల్ ఓ దాతల నుండి వనరులు సేకరించి 4200 మందికి సహాయం అందించింది. ప్రత్యేకించి ఒంటరి మహిళా రైతులు, వ్యవసాయ కూలీలు, వలసవెళ్లి తిరిగి వచ్చిన కుటుంబాలకు చెందిన మహిళా రైతులకు ఈ సహాయం అందించారు. స్థానికంగా పండించే ప్రధాన పంటల విత్తనాలతో పాటు పంచామృతం, జీవామృతం, పంచగవ్య వంటి జీవ ఎరువులు, కీటకనాశకాలను సమిష్టిగా తయారుచేసుకోవటనికి కూడా సహాయం అందించారు.

2019లో స్థానిక రైతులనుండి సేకరించిన సాంప్రదాయ పంటల విత్తనాలతో ఏర్పరచిన విత్తన బ్యాంకుల నుండి సాధారణంగా డబ్ల్యూ జి డబ్ల్యూ ఎల్ ఓ సభ్యులు విత్తనాలను మార్పిడి చేసుకుంటారు. కోవిడ్ సమయంలో ఆ విత్తనాల బ్యాంక్ తో పాటు ఇతర భాగస్వామ్య సంస్థలు సేకరించిన విత్తనాలను మొత్తం 850 మంది మహిళా రైతులకు అందించారు. ఈ విధంగా సహాయం అందుకున్న మహిళా రైతులు దాదాపు 5000 మంది వారు పంట పండించిన తర్వాత తీసుకున్న విత్తనాలకు రెట్టింపు మొత్తాన్ని కమ్యూనిటీ విత్తన బ్యాంకు కు తిరిగి చెల్లిస్తారు. ఈ విత్తన బ్యాంకులను మహిళా సమాఖ్యలు నిర్వహిస్తాయి, ఆ విధంగా తిరిగి వచ్చిన విత్తనాలను తర్వాతి సీజన్లకు ఇతర మహిళా రైతులకు మార్పిడి చేస్తారు.

చిన్న, సన్నకారు, పేద మహిళా రైతులకు కోవిడ్ విపత్తు సాంఘిక, ఆర్థిక జీవనోపాధి సమస్యలను కొని తెచ్చింది. ఇక్కడ వివరించిన సహాయ కార్యక్రమం వారికి తాత్కాలిక ఉపశమనాన్ని మాత్రమే కలిగించగలుగుతుంది. సహాయ కార్యక్రమాలతో పాటు డబ్ల్యూ జి డబ్ల్యూ ఎల్ ఓ సుస్థిర వ్యవసాయాన్ని పెంపొందించే కార్యక్రమాలను కూడా సమిష్టిగా ప్రోత్సహించి మహిళా రైతులు మెరుగుగా తమ జీవనోపాధులను నిలబెట్టుకోవటానికి తోడ్పడింది .

ఫోటో డబ్ల్యు జి డబ్ల్యు ఎల్ ఓ




మహిళా కిసాన్ సఖి, దరియా బెన్, ఖరీఫ్ సీజన్ లో మహిళా రైతులకు విత్తనాల కిట్ లను పంపిణి చేయటం - సారథి, సత్రంపూర్, మహిసాగర్ .

# 8. “మాకు ఇప్పుడు కార్మికులం అనే గుర్తింపు వచ్చింది” - నిర్మల కథ

**రచయితలు**: సువర్ణ దామ్లే , నిర్మల కథావ్టే

ఫోటో ప్రకృతి



జాబ్ కార్డులు సాధించిన మహిళలతో నిర్మల

ప్రకృతి అనే స్వచ్ఛంద సంస్థ 1990 నుండి మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో గ్రామీణ మహిళల సాధికారత కోసం పనిచేస్తున్నది. 2005-06 లో ఉపాధి హామీ పథకాన్ని కొన్ని జిల్లాలలో ప్రయోగాత్మకంగా ప్రారంభించినప్పటినుండి ప్రకృతి గ్రామీణ ప్రజల ఉపాధి సమస్యలపై పనిచేయటం మొదలుపెట్టింది. మధ్యప్రదేశ్ లోని బాలాఘాట్ జిల్లా, మహారాష్ట్రలోని భాంద్రా జిల్లాలు ఈ పథకం కోసం ఎంపికయ్యాయి, ఈ రెండు జిల్లాలలో ప్రకృతి సంస్థ గ్రామపంచాయతీలతో కలసి ప్రజలకు పథకం గురించి అవగాహన కల్పిస్తూ ఈ పథకం కింద జరగాల్సిన పనులను గుర్తించే కార్యక్రమం చేసింది. కోవిడ్ లాక్ డౌన్ మొదటి దశలో ప్రకృతి సంస్థ మహిళా రైతుల హక్కుల వేదిక (మకాం) రాష్ట్ర స్థాయిలో చేపట్టిన ప్రయత్నాలతో చేతులు కలిపి ఉపాధి అవసరమున్న వారికి జాబ్ కార్డుల అందించే పనిపై కేంద్రీకరించింది.

## సహాయ కార్యక్రమాల అవసరం

నిర్మల కథావ్టే నివసించే గ్రామం నాగపూర్ జిల్లాలో 150 ఇళ్లున్న సవర్మెంధా అనే ఊరు, ఇక్కడ ఎక్కువగా చిన్న సన్నకారు రైతులు పత్తి పంటను సాగు చేస్తారు. ఈ గ్రామంలో గత కొద్ది సంవత్సరాలుగా పత్తి సాగు ఖర్చు పెరుగుతున్నప్పటికీ పత్తి దిగుబడులు తగ్గుతూ వస్తున్నాయి. దీనితో చాలా మంది రైతులు తమ భూములను అమ్మేసుకునే పరిస్థితికి నెట్టబడ్డారు. దానితో సాగు భూమి విస్తీర్ణం తగ్గిపోయి వ్యవసాయ కూలీలకు పని లేకుండా పోయింది. కోవిడ్ విపత్తు, దాని కారణంగా విధించిన లాక్ డౌన్ వారి పరిస్థితిని మరింత దిగజార్చాయి. సాధారణంగా వ్యవసాయం బాగా జరిగినప్పుడు మహిళలకు నాట్లు, కలుపు, కోత వంటి పనులు నిరంతరం దొరికేవి, అయితే కోవిడ్ లాక్ డౌన్ తో వారికి పని దొరకటం కష్టమైపోయింది. సాగుదార్లు నష్టాలు ఎదుర్కుంటున్న కారణంగా కూలీలను పనులలో పెట్టుకోలేదు. సాగుదారులు ఎక్కువగా తమ కుటుంబ సభ్యులు, అంటే పిల్లలు, వలస

ఫోటో ప్రకృతి



జాబ్ కార్డు కలిగిన మహిళా తన బ్యాంక్ అకౌంట్ లో వేతనాలు పడినట్లు చూపిస్తున్న పాస్ బుక్

నుండి తిరిగి వచినవారితోనే పనులు చేసుకున్నారు. దీనితో ఒంటరి మహిళలు అందుబాటులో వున్న కొద్ది పనులకు కుటుంబ సభ్యులతో పోటీ పడవలసి వచ్చింది.

ఇప్పటివరకు నిర్మలకు కానీ, ఆమె గ్రామంలోని ఇతర మహిళలకు కానీ జాతీయ ఉపాధి హామీ పధకం గురించి పూర్తిగా తెలియదు. ప్రభుత్వం గ్రామంలో ఇతర పథకాల మాదిరిగానే ఏవో పనులు చేయిస్తుంది అని తెలుసుకానీ దానిపట్ల పెద్దగా దృష్టి పెట్టలేదు. ప్రకృతి నిర్వహించిన ఒక శిక్షణలో నిర్మలకు జాతీయ ఉపాధి హామీ పథకం గురించి తెల్సింది, తర్వాత ఆమె దాని గురించి ఇతర మహిళలకు తెలియజేసింది. ఆ గ్రామంలో 18 మంది ఒంటరి మహిళలకు పని అవసరం వుంది కానీ ఉపాధి హామీ పధకంలో పనిచేయటానికి అవసరమైన జాబ్ కార్డులు లేవు. నిర్మల దీనికోసం నడుం బిగించి వారివద్ద నుండి అవసరమైన పత్రాలను సేకరించి గ్రామంలోని ఉపాధి హామీ పధకం కార్యకర్తకు( రోజ్గార్ సేవక్ అని అంటారు) జాబ్ కార్డుల జారీ కోసం అందించింది.

కానీ రోజ్గార్ సేవక్ ఆ మహిళలకు జాబ్ కార్డులు ఇవ్వటంలో ఆసక్తి కనబరచలేదు, అనేకసార్లు అతడిని, సర్పంచ్ ని జాబ్ కార్డులు ఇవ్వమని కోరినప్పటికీ వాళ్ళు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. అయినప్పటికీ నిర్మల పట్టు వదలకుండా వారిని నిరంతర అడుగుతూ వచ్చిన ఫలితంగా చివరికి ఆ ఒంటరి మహిళలందరికీ జాబ్ కార్డులు జారీ అయ్యాయి.

జాబ్ కార్డులు పొందటం ఒక సవాలు అయితే ఒంటరి మహిళలను పనికోసం దరఖాస్తు పెట్టుకునేలాగా ప్రోత్సహించటం మరొక సవాలుగా మారింది. వారిలో చాలా మంది ఉపాధి హామీ పధకం గురించి అపోహలు కలిగి వుండి అక్కడి పని ప్రదేశం పొలాలలో పనిచేసినంత గౌరవప్రదమైనది కాదు అనే ఆలోచనతో వున్నారు. అప్పుడు నిర్మల వారికి ఉపాధి హామీ పనికూడా వ్యవసాయ పనుల వంటిదేనని, నిజానికి దీనిలో మెరుగైన వేతనాలు లభిస్తాయని వారికి వివరించింది.

ఒంటరి మహిళలు తమ పిల్లలను వదిలి రోజుకూలి పనులకోసం దూరప్రాంతాలకు వెళ్లలేని పరిస్థితిలో వారు తమ దగ్గరలోని వ్యవసాయ భూములలోనే పనిచేయటానికి సుముఖంగా ఉండేవారు, అయితే ఈ సంవత్సరం అధిక వర్షాలు, అకాల వర్షాల వల్ల కలుపు తీసే పనులకు వెళ్ళటం కష్టమైంది, పంట కోతలు మొదలైనప్పటికీ పంట దిగుబడులు తగ్గిపోవటం కారణంగా పని ఎక్కువగా దొరకలేదు.

## ఈ కార్యక్రమ ఫలితాలు, నేర్చుకున్న గుణపాఠాలు

కొవిడ్ కష్టకాలంలో నిర్మల ఒంటరి మహిళలను చైతన్య పరచి వారు ఉపాధి హామీ పధకంలో జాబ్ కార్డులు పొందేటట్లు, పనికోసం దరఖాస్తు చేసుకుని పని చేయటం మొదలుపెట్టేటట్లు చేయటంలో విజయం సాధించింది. మొట్టమొదట ఉజ్వల, చందా అనే మహిళలు ఉపాధి హామీ పని చేయటం మొదలుపెట్టి వేతనాల పొందటంతో సంతోషం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పధకంలో వేతనాలు మెరుగ్గా ఉన్నాయని వారు చెప్పారు, ఎడతెరిపి లేని వర్షాల మూలంగా పనికి వెళ్లలేక ఒక్కరోజు పనిచేసినప్పటికే

తనకు వేతనం లభించింది అని వారిలో ఒకరు చెప్పారు. గర్భసంచి సమస్యలు, పునరుత్పత్తి సమస్యల మూలంగా పత్తి ఏరి నడుముకు కట్టిన సంచిలో పెట్టుకుని పనిచేయటంలో ఇబ్బంది పడుతున్న మహిళల గురించి నిర్మల చెప్పింది. అయితే వారు ఉపాధి హామీ పనిలో తమకు అనుకూలంగా వున్న సామాజిక అడవుల పెంపకం పని చేసినట్లు నిర్మల చెప్పింది. దీనిలో వేతనాలు ఎక్కువుగా లేనప్పటికీ పని సౌకర్యంగా ఉన్నట్లు ఆ మహిళలు చెప్పారు. అన్నిటికంటే ముఖ్యంగా జాబ్ కార్డు ఉండటం వల్ల వారికి కార్మికులు అనే గుర్తింపు ఉన్నట్లు వారు భావిస్తున్నారు, పైగా వారికి పని భద్రత, అత్యవసర ఆరోగ్య వసతులు హక్కుగా లభిస్తాయి, ఇవి వారికి వ్యవసాయ కూలీగా వున్నప్పుడు ఎన్నడూ లభించలేదు. ఉపాధి హామీ పనిలో చేరిన ఒంటరి మహిళలందరూ జాబ్ కార్డులు కలిగిన కూలీలుగా వారు ప్రభుత్వ అధికారులతో మాట్లాడవచ్చు అనే విషయం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

ఈ ఒంటరి మహిళలు నిజాయితీతో పనిచేస్తున్నందు ఫీల్డ్ అసిస్టెంట్ ( రోజ్గార్ సేవక్ ) కూడా సంతృప్తి వ్యక్తపరచాడు, అతడు వారి పనిని అజమాయిషీ చేయాల్సిన అవసరం లేకుండా పోయింది. నిర్మలకు ఈ మొత్తం కార్యక్రమం ఒక విలువైన అనుభంగా నిలిచింది, మొదట ఉపాధి హామీ పథకం గురించి లోతైన సమాచారం తెలుసుకోవటం, అంతకంటే ముఖ్యంగా పనిదొరకని సంక్షోభ సమయంలో మహిళలను కూడగట్టి వారికి ప్రభుత్వ పథకంలో పనిదొరికేటట్లు సహాయపడటం, ఆ విధంగా వారికి లాభం చేకూర్చటం నిర్మలకు చాలా సంతోషాన్నిచ్చింది. ఆమె ఇపుడు జాతీయ ఉపాధి హామీ పని పథకంలో గ్రామ స్థాయి ప్రణాళిక తయారుచేయడంలో క్రియాశీలంగా పనిచేయాలని ఆశిస్తున్నది.

ఫోటో ప్రకృతి



జాతీయ ఉపాధి హామీ పని ప్రదేశంలో పనిచేస్తున్న మహిళలు

# 9. యమునాఖద్దార్ లో కోవిడ్ సంక్షోభానికి మహిళారైతుల స్పందన

**రచయిత**: విక్రమ్ సింఘ్ ;
సహ రచయితలు, అనువాదకులు - రీషా రామచంద్రన్, ముబషీరా జైదీ

ఫోటో విక్రమ్ సింగ్



యమునా ఖద్దర్ లో కోవిడ్ -19 లాక్ డౌన్ సమయంలో పంపిణి చేయటానికి సహాయ పదార్థాలను పాకింగ్ చేస్తున్న యువ బృందం

యమునా ఖద్దార్ అంటే యమునానది చుట్టూ ఉండే సారవంతమైన భూమి, ఇది తూర్పు ఢిల్లీ లో ఢిల్లీ- నోయిడా నుండి వాజీరాబాద్ డైరెక్ట్ ఫ్లయ్ ఓవర్(DND) వెంట వుంది. ఈమార్గం రెండు వైపులా కామన్వెల్త్ స్టేడియం, అక్షరధామ్ గుడి వంటి అనేక పేరుపొందిన ప్రదేశాలున్నాయ. అయితే ఈ ప్రాంతంలో స్వతంత్రం వచ్చినప్పటినుండి నివసిస్తున్న వ్యవసాయ కుటుంబాల పంట భూములు కూడా వున్నాయి. ఢిల్లీ రైతుల సహకార మల్టీపర్పస్ సొసైటీ(DPCMS) కి ఢిల్లీ డెవెలప్మెంట్ అథారిటీ తో వున్న కాంట్రాక్ట్ ప్రకారం ఈ ప్రాంతంలో వ్యవసాయం చేసే కుటుంబాలకు ప్లాట్లు కేటాయించారు, దానికి వారి నుండి అద్దె వసూలు చేసేవారు. అయితే 1966లో ఆ కాంట్రాక్టును రద్దు చేశారు కానీ 2010 వరకు అద్దె వసూలు చేశారు, రెండేళ్ల తర్వాత ఆ ప్లాట్లను నిరంకుశంగా కూల్చివేశారు. .

## కోవిడ్ లాక్ డౌన్ ప్రతికూల ప్రభావాన్ని తట్టుకోవటంలో మహిళా రైతులు యువతీ యువకుల పాత్ర

2020 మార్చి 24వ తేదీనాడు ప్రభుత్వం దేశవ్యాప్త లాక్ డౌన్ విధిచింది, దానితో కదలికలపై ఆంక్షలు విధించారు, స్థానిక మార్కెట్లను మూసివేశారు, ఇది చాలా మంది రైతుల జీవనోపాధులను దెబ్బతీసింది. ప్రభుత్వం వీధులలో కూరగాయలు అమ్ముకోవటానికి అనుమతించినప్పటికీ యమునా ఖద్దార్ లోని కూరగాయలు అమ్మేవారిపై పోలీసులు లాఠీ ఛార్జి చేశారు. దానికి తోడు యమునా నదికి వరదలు రావటంతో పంటలు నాశనమయ్యాయి, లాక్ డౌన్ సమయంలో పురుగుమందుల ధరలు పెరిగిపోయాయి. కొత్తగా పంటలు వేయటానికి పెట్టుబడులు లేక యమునా ఖద్దార్ లోని వ్యవసాయ కుటుంబాలు తీవ్రమైన పేదరికంలోకి నెట్టబడ్డారు.

ఫోటో విక్రమ్ సింగ్



యమునా ఖద్దర్ లో పిల్లలకు శనివారం నాడు ప్రత్యేక నైతిక విద్య పాఠాలు చెబుతున్న విక్రమ్

యమునా ఖద్దార్ లోని మాలా అనే మహిళా రైతు తాను అద్దెకు తీసుకున్న ప్లాట్ లో పండించిన పంటను దగ్గరలోని మార్కెట్ లో అమ్ముకుని బ్రతికేది, కానీ లాక్ డౌన్ తో మార్కెట్ ను మూసివేసిన తర్వాత ఆమె కుటుంబం దాదాపు ఆకలితో మాడవలసిన దుర్బల పరిస్థితికి చేరింది. మాలా మాదిరిగానే ఇక్కడ నివసించే అనేకమంది ఉత్తర్ ప్రదేశ్ లేదా బీహార్ నుండి పని కోసం వలసవచ్చారు. విమలాదేవి అనే మహిళ ఉత్తరప్రదేశ్ లోని బడాన్ జిల్లాలోని చిన్న గ్రామం నుండి 20 ఏళ్ల క్రితం ఇక్కడికి వలస వచ్చింది. వ్యవసాయమే ఆమె ప్రధాన జీవనాధారంగా ఉండేది, కానీ వ్యవసాయం నుండి తగినంత ఆదాయం లభించక ఆమె చిన్న వ్యాపారం ప్రారంభించింది. "వ్యవసాయంతో వచ్చే ఆదాయంతో కుటుంబం గడవక నేను కుటుంబాన్ని పోషించటానికి చిన్న పకోడీల బండి పెట్టుకున్నాను" అని విమలాదేవి చెప్పింది. వ్యవసాయంలో పెట్టుబడి పెరిగిపోవటంతో మరికొంత మంది మహిళలు కూడా బ్రతుకుదెరువు కోసం చిన్న వ్యాపారాలలోకి విస్తరించారు. గుడియా అనే యువ మహిళా రైతు చిన్న నర్సరీ పెట్టుకుంది. "నాకు ఈ నర్సరీ ఆర్థికంగా సహాయంగా వుంది, దానికి తోడు ఇది పర్యావరణహితమైనది కూడా, దీనితో కాలుష్యాన్ని తగ్గించవచ్చు "అని గుడియా చెప్పింది. మహిళలు చేపట్టిన ఈ చిన్న వ్యాపారాలు ప్రభుత్వం నుండి ఎటువంటి సహాయం లేకుండానే ఈ కష్టకాలంలో మంచి జీవనోపాధి మార్గాలుగా రుజువయ్యాయి. వీటి ద్వారా మహిళలు తమ కుటుంబాలను బ్రతికించుకోగలిగారు, అదే సమయంలో ఈ ప్రాంతంలోని ఇతర పేద కుటుంబాలకు ఉత్తేజంగా నిలిచారు.

అనేక అనిశ్చిత పరిస్థితులలో యమునా ఖద్దార్ లోని మహిళలు ముందడుగు వేసి నాయకత్వ లక్షణాలతో అవసరమైన మద్దతు కూడగట్టటానికి వివిధ సంఘాలు, సమూహాలతో సంబంధాలను ఏర్పరుచుకున్నారు. ఉదాహరణకి మాలా వారి సమూహంలో ఆహార కొరత సమస్యను, చౌక ధరల దుకాణాల నుండి రేషన్ పొందటంలో సమస్యల గురించి అందరి దృష్టికి తెచ్చింది. ఆమె తన సమూహంలో చురుకుగా పనిచేసే విక్రమ్ అనే యువ సభ్యుడికి ఈ సమస్య గురించి చెప్పింది. అతడు బస్తి సురక్ష మంచ్ వంటి పౌర సమాజ సంస్థలకు, వ్యక్తులకు ఈ సమస్యను చేరవేశాడు వారి సహాయంతో మాలా, విక్రమ్ కలసి అవసరంలో వున్న 1400 కుటుంబాలకు ఆహార పదార్థాలను సేకరించగలిగారు, వాటిలో 100 వరకు విధవలు, ఒంటరి మహిళల కుటుంబాలున్నాయి.

అదేవిధంగా చేయటానికి పనిలేక, నగరానికి దూరంగా అటవీ ప్రాంతంలో నివసిస్తున్నవలస కార్మికులు ఆకలితో మాడుతుండటం గమనించారు, గుడియా సహాయంతో విక్రమ్ ఆ వలస కార్మికులను సందర్శించి వారి సమస్యల గురించి తెలుసుకున్నాడు. తర్వాత అతడు బస్తి సురక్ష మంచి, ఢిల్లీ మకాం బృందాన్ని కలసి వారికి అత్యవసర సహాయం అందించాల్సిందిగా కోరాడు. ఈ రకమైన చొరవతో చేసిన కార్యక్రమంలో 110 వలస కుటుంబాలకు ఆహార పదార్థాలు, ఇతర సహాయ వస్తువులు అందించారు. గడియా, మాలా, విక్రమ్ లు తమ సమూహాలకు చేపట్టిన నాయకత్వ చర్యలు ఢిల్లీ మకాం బృందం వంటి సంస్థలు దుర్బల స్థితి లో వున్న కుటుంబాలకు సహాయం అందించటానికి వీలు కల్పించాయి.

కోవిడ్ విపత్తు పరోక్ష ప్రభావంగా పాఠశాలలు, అంగన్వాడీలు మూతపడ్డాయి. తమ పిల్లలకు మొబైల్ ఫోన్లు కొనే స్థోమత లేకపోవటము, విద్యుత్ సరఫరా ఉండకపోవటం వల్ల తమ పిల్లలు

చదువుకు దూరమవుతారని మహిళా రైతులు ఆందోళన చెందారు. రామశ్రీ అనే మహిళా రైతు లాక్ డౌన్ సమయంలో పిల్లలు చదువు మానేస్తున్న సమస్యను వెలుగులోకి తెచ్చింది. దీని కారణంగా ఆడపిల్లలకు చిన్న వయసులో పెళ్లిళ్లు చేయటం కూడా పెరగసాగింది, ఆడపిల్లలు పూర్తిగా చదువుకు దూరమవసాగారు. ఆమె స్వంత పిల్లలు చదువు కొనసాగించలేకపోయారు. విక్రమ్, అతడి సోదరుడు, స్నేహితులు కలిసి పిల్లలకు, ప్రత్యేకించి ఆడపిల్లలకు 7వ తరగతి వరకు చదువు చెప్పటానికి ముందుకొచ్చారు. వారు రామశ్రీ కుటుంబంలో 5గురు పిల్లలతో మొదలుపెట్టినప్పటికీ తర్వాత యమునా ఖద్దార్ లో మొత్తం 250 మంది పిల్లలకు చదువు చెప్పసాగారు. ఇక్కడి వ్యవసాయ కుటుంబాలను, వారి పిల్లలకు చదువు చెప్పటం ద్వారా భవిష్యత్ తరాలను స్వశక్తులుగా చేయటం, వ్యవసాయంపై అవగాహన కల్పించి వారి సమూహంపై దోపిడీని తగ్గించటం తమ లక్ష్యమని విక్రమ్ నొక్కి చెప్పాడు.

## కోవిడ్ విపత్తు నుండి నేర్చుకున్న పాఠాలు

మౌలిక హక్కులు కూడా లేని పరిస్థితిలో యమునా ఖద్దార్ లోని మహిళలు, యువకులు నాయకత్వ లక్షణాలతో సమిష్టిగా పౌర సమాజ సంస్థలతో కలసి సహాయ కార్యక్రమాల కోసం ఒక వ్యవస్థను నిర్మించుకున్నారు. బస్తి సురక్ష మంచ్ , మకాం ఢిల్లీ బృందం వంటి సంస్థలతో సంబంధాలు ఏర్పరచుకుని తమ సమస్యలను వెలుగులోకి తెచ్చి సహాయ కార్యక్రమాలు నిర్వహించారు. అటువంటి సమూహ స్పందన అనేది కోవిడ్ లాక్ డౌన్ సమయంలో సమాజంలో వున్న తారతమ్య భేదాలు, లోపల ఫలితంగా ఎదురయ్యే నష్టాలను తగ్గించటంలో వారి బలాన్ని నిరూపించింది. కోవిడ్ విపత్తు కచ్చితంగా అణగారిన సెక్షన్ల ప్రజలు ఎదుర్కునే సవాళ్ళను, సమస్యలను వెలుగులోకి తేవటమే గాక ప్రజలసహిష్ణుత, తట్టుకుని నిలబడే సామర్ధ్యాలను, వారిలో వున్న వనరులను, చొరవను కూడా ప్రదర్శించింది, ఇవి ఇంతకు ముందెన్నడూ లేని విధంగా సంక్షోభాన్ని తట్టుకుని నిలబడటానికి సహాయపడ్డాయి.

ఈ కథనంలో పొందుపరిచిన అనుభవాలను, యమునా ఖద్దార్ లో మకాం ఢిల్లీ బృందంతో కలసి ఈ మొత్తం సహాయ కార్యక్రమంలో కీలక పాత్ర వహించిన విక్రమ్ సింఘ్ వివరించాడు.

ఫోటో విక్రమ్ సింగ్



2020 మే నెలలో మహిళలు పురుషులు కల్సి పంటను కోస్తున్న దృశ్యం. లాక్ డౌన్ కారణంగా రైతులు పంటను మార్కెట్ లో అమ్ముకోలేక అప్పుల పాలవుతున్న సందర్భం.

# 10. కోవిడ్ సంక్షోభ సమయంలో మహిళా రైతుల ప్రత్యామ్నాయ సహాయ కార్యక్రమాల నమూనాలు

**రచయిత**: సి.భానుజ, డైరెక్టర్, REDS

ఫోటో: REDS




రూరల్ ఎన్విరాన్మెంట్ డెవెలప్మెంట్ సొసైటీ(REDS) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనంతపురము జిల్లాలో 10 మండలాలలోని 58 గ్రామాలలో పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థ. గత 25 ఏళ్లుగా ఈ సంస్థ మహిళల హక్కులు, పిల్లల హక్కులు, మానవ అక్రమ రవాణా, విద్య, వ్యవసాయం, సహజ వనరుల నిర్వహణ వంటి అంశాలపై పనిచేస్తున్నది. రెడ్స్ సంస్థ చిన్న సన్నకారు రైతులను రైతు ఉత్పత్తిదారుల సంఘాలలో సంఘటిత పరచి తీవ్ర కరువు, వ్యవసాయ సంక్షోభము నెలకొన్న ఈ జిల్లాలలో మిశ్రమ సాగును ప్రోత్సహిస్తున్నది. అనేకమంది మహిళా రైతులను, ఒంటరి మహిళలను కూడగట్టి వ్యవసాయ సంక్షోభానికి పరిష్కారంగా సమిష్టి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నది. కోవిడ్ లాక్ డౌన్ సమయంలో రెడ్స్ సంస్థ మహిళా రైతుల సహకార సంఘాలతో కలసి ఇబ్బందులలో వున్న వారికి సహాయం అందించేందుకు అనేక చర్యలు చేపట్టింది. మహిళా రైతులు పండించిన ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించింది, వారి నుండి కొనుగోలు చేసిన చిరుధాన్యాలు, పండ్లు, కూరగాయలను తిండి లేక ఇబ్బంది పడుతున్న కుటుంబాలకు అందించింది. ఈ సహాయ చర్యలను ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేస్తూ సాగించింది.

అకస్మాత్తుగా లాక్ డౌన్ విధించటంతో చిన్న సన్నకారు రైతులు తమ ఉత్పత్తులు అమ్ముకోలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వలస కార్మికులు పనులు లేక తిండి లేక దుర్భర పరిస్థితులలోకి నెట్టబడ్డారు. అదే సమయంలో ఇతర ప్రాంతాలకు వలసపోయిన కార్మికులు వెనక్కి తిరిగి రావటంతో గ్రామంలో పెద్ద ఎత్తున సామాజిక, ఆర్థిక ఒత్తిడి నెలకొంది. ఒంటరి మహిళలు, రైతు ఆత్మహత్య బాధిత కుటుంబాలు అందరికంటే ఎక్కువగా ఇబ్బందులు పడ్డారు. పాలను ఉత్పత్తి చేసే రైతులు మార్కెటింగ్ సౌకర్యం లేక నష్టపోయారు. ఈ పరిస్థితిలో ఇబ్బందులలో వున్నవారికి ఆహారం అందించటానికి, పాడైపోతున్న వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కలిపించటానికి పెద్ద ఎత్తున జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఏర్పడింది.

ఫోటో: REDS



## సమన్వయంతో సాగిన సహాయ కార్యక్రమాలు

రెడ్స్ సభ్యులు, మహిళా రైతుల ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులు కలసి మొదట సమస్యలను గుర్తించి వాటిని పరిష్కారం చేయటానికి ఒక ప్రణాలికను రూపొందించారు. రైతులనుండి ఉత్పత్తులను కొని ఆహారం అవసరం వున్న వారికి అందించటానికి ఏర్పాట్లు చేశారు. రెడ్స్ సభ్యులు, మహిళా రైతులు కలసి గ్రామాలను సందర్శించి ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు కోతకు సిద్ధంగా ఉన్నట్లు తెలుసుకుని ఆ రైతులతో సంప్రదింపులు జరిపారు. మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఇతర రైతులనుండి వారి ఉత్పత్తులన్ను కొని గ్రామాలలో ఆహారం కొనుక్కోలేని పరిస్థితిలో వున్న కుటుంబాలకు ఆహార పదార్ధాలను అందించారు. అవసరంలో వున్న కుటుంబాలకు ఇచ్చిన ఆహార కిట్ లలో ధాన్యం, గుడ్లు, కూరగాయలు, పండ్లు, మాస్కులు, శానిటైజర్లు వంటి 20 రకాల వస్తువులు చేర్చారు. మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు 9 రకాల చిరుధాన్యాలు, పప్పులు కూడా కొనుగోలు చేశాయి, ఆ విధంగా వారికి మార్కెటింగ్ సౌకర్యం కల్పించాయి. ఖరీఫ్ సీజన్ లో పంటలు వేయటానికి వీలుగా రైతులకు వేరుశెనగ విత్తనాలు, నవధాన్యాల విధానాలను, పెరటి తోటలకు కూరగాయ విత్తనాలను కూడా అందించారు. ఈ సహాయ కార్యక్రమాలను జిల్లాలోని 10 మండలాలలో మొత్తం 30 గ్రామాలలో చేపట్టారు.

అనంతపురం మండలంలోని కామారుపల్లి గ్రామంలో కోవిడ్ కేసును గుర్తించటంతో ఆ గ్రామాన్ని రెడ్ జోన్ గా ప్రకటించారు, గ్రామం నుండి ఎవరు బయటికి వెళ్ళటానికి, బయటినుండి ఎవరు లోపలి రావటానికి వీలులేకుండా అత్యధిక నిఘా విధించారు. ఆ గ్రామంలో నివసించే అనంత గ్రామీణ మహిళా రైతుల ఉత్పత్తిదారుల సంఘం నాయకురాలు ఆర్.సుశీలమ్మ చొరవ చేసి గ్రామంలో మహిళా రైతులు పండించే కూరగాయలను కొనుగోలు చేశారు. అవసరంలో వున్న కుటుంబాలకు వారం రోజులపాటు సరిపోయే కూరగాయలను ఉచితంగా పంచి పెట్టారు.

అనంతపురం మండలం లోని పూలకుంట గ్రామంలో 220 కుటుంబాలు పాడి పశువులను పెంచుకుంటూ పాలు అమ్ముకుని బ్రతుకుతున్నారు, లాక్ డౌన్ కారణంగా వారు బయటికి వెళ్లి పాలు అమ్ముకునే అవకాశం లేక నష్టపోయారు. ఆ గ్రామంలో రైతు ఉత్పత్తిదారుల సంఘం నాయకురాలు అరుణమ్మ ఈ సమస్యను రెడ్స్ సంస్థ బాధ్యుల దృష్టికి తీసుకొచ్చింది. రెడ్స్ సంస్థ జిల్లా అధికారులను సంప్రదించి వారితో సమన్వయంతో అనుమతి పొంది గ్రామంలో ఉత్పత్తయ్యే పాలను గ్రామంలోని రైతు ఉత్పత్తిదారుల సంఘం సేకరించి తాత్కాలికంగా ఒక డైరీని ఏర్పాటు చేసి ప్రయివేటు వ్యాపారస్తులకు పాలను అమ్మారు. ఆ విధంగా ఒక వారం రోజులపాటు అమ్ముకోలేక నష్టపోయిన పాడి రైతులకు మార్కెట్ సౌకర్యం కల్పించారు. వారి పాడిపశువులకు అవసరమైన దాణా కూడా అందించారు.

అనంతపురంజిల్లా స్థాయిలో అన్నిసహాయ కార్యక్రమాలను సమన్వయము చేయటానికి అన్ని ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలతో ప్రభుత్వం ఒక జిల్లా సమన్వయ కమిటీని ఏర్పరచింది. దీనిలో రెడ్స్ కూడా సభ్య సంస్థగా వుంది. ఈ కమిటీ జిల్లాలోని సమస్యలపై సర్వే సాగించి దాని ఆధారంగా సహాయ కార్యక్రమాలను ప్రణాళికచేసి అమలుచేసిందిఅనేక సంస్థలు, వ్యక్తులు అందించిన సహకారంతో చాలా గ్రామాలలో వివిధ రకాల సహాయం అందించటానికి వీలు కలిగింది. ఈ కమిటీ ఆర్ధిక వనరులను పోగుచేయటంతోపాటు సమన్వయము, సలహాలు అందించింది

.

ఈ సహాయ చర్యల ద్వారా మొత్తంమీద 7200 కుటుంబాలకు సహాయం అందించారు, వారిలో రోజుకూలీ కార్మికులు, వ్యవసాయ కుటుంబాలు, ఒంటరి మహిళలు, వృద్ధులు, వలస కార్మికులు ఎక్కువగా వున్నారు.

24 గ్రామాలలో 500 కుటుంబాలకు ఆహారకిట్లు అందించారు. మహిళలు, యుక్తవయసు బాలికల కోసం ఆరోగ్యం, పారిశుధ్య సామాగ్రిని 300 కుటుంబాలకు అందించారు. రేషన్ కార్డులు లేని 100 కుటుంబాలకు అదనంగా 10 కిలోల బియ్యం, 5 కేజీల రాగులు పంపిణిచేశారు.కామారుపల్లి, పూలకుంట గ్రామాలలో పాడి పశువులను పెంచుకునే 73 కుటుంబాలకు 50 కేజీల దాణా సంచులను అందించారు. 4 గ్రామాలలో 223 కుటుంబాలకు ఖరీఫ్ సీజన్ కోసం విత్తనాలను ఇచ్చారు.

## ఫలితాలు - పాఠాలు

ఇంత పెద్ద ఎత్తున సమన్వయంతో సాగిన సహాయ కార్యక్రమాల ద్వారా రుజువైంది ఏమిటంటే మహిళా రైతులు ఒకచోటికి వచ్చి సమిష్టి వ్యవసాయం, సమిష్టి మార్కెటింగ్ చేసినప్పుడు ఆహారము , విత్తనాల అదనపు నిల్వలు ఏర్పడి వాటిని అవసరంలో వున్న ఇతరులకు పంచి పెట్టే అవకాశం ఉంటుంది. ఇతర రైతులకు విత్తనాలను అందించటం వల్ల వారికి ఖరీఫ్ సీజన్లో పంటలు చేసుకోవటానికి భద్రత ఏర్పడింది , అదే సమయంలో విత్తనాలను తయారుచేసిన మహిళా రైతులకు ఆదాయం అందింది. ప్రభుత్వ వ్యవసాయ శాఖ, జిల్లా అధికారులు, కలెక్టర్ కూడా మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘాలలో వున్న బలాన్ని గుర్తించి మార్క్ ఫెడ్ (MARKFED) ద్వారా ఉత్పత్తిదారుల సంఘాల నుండి వారి ఉత్పత్తులను కొనుగోలు చేయటానికి ముందుకొచ్చారు. ఇప్పుడు జిల్లా అధికారులు మహిళా రైతులను వ్యవసాయ శాఖ తీసుకునే పథకాలన్నిటిలో మహిళా రైతులను పాల్గొనేటట్లు చర్యలు తీసుకుంటున్నారు.

ఫోటో: REDS



# 11. కోవిడ్-19 లాక్ డౌన్ లో మహిళా రైతులు : సహాయ కార్యక్రమాల అవసరం

**రచయిత** : ఫాతిమా బెర్నాడ్ , ఎస్ ఆర్ ఇ డి, తమిళనాడు

ఫోటో: SRED



ఎస్ ఆర్ ఇ డి ఏర్పాటు చేసిన మహిళా సంఘం సహాయ చర్యలలో భాగంగా ఆహార పదార్థాలను పంపిణి చేస్తున్న దృశ్యం

సొసైటీ ఫర్ రురల్ ఎడ్యుకేషన్ అండ్ డెవెలప్మెంట్ (SRED)అట్టడుగు స్థాయి శ్రామిక సమూహాల అవసరాలు, సమస్యల ఆధారంగా ఉద్యమాలను నిర్మించే ఉద్దేశంతో 1979 లో స్థాపించబడింది. ఎస్ ఆర్ ఇ డి పనిచేస్తున్న శ్రామిక సమూహాలలో గ్రామీణ దళిత, ఆదివాసీ సమూహాల మహిళలు ప్రధాన సమూహంగా వున్నారు.

ఎస్ ఆర్ ఇ డి స్థానిక నాయకత్వానికి, ప్రజా ఉద్యమ నాయకులకు సామర్థ్యాలను నిర్మించటంలో కూడా కృషిచేస్తున్నది. స్థానిక స్థాయిలో ఈ సంస్థ మహిళలపై హింస, కుల -జెండర్ వివక్ష, జీవనోపాధుల సంక్షోభం, విద్య, వైద్య సదుపాయాల కొరత మొదలైన సమస్యలను పరిష్కరించటానికి కూడా కార్యక్రమాలు చేపడుతుంది. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో ఎస్ ఆర్ ఇ డి ఇతర విస్తృత ఉద్యమాలతో చేతులు కలిపి ప్రచార ఉద్యమాలలో, ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేయటంలో, ఐక్యసంఘటనల నిర్మాణంలో పనిచేస్తుంది .

ఎస్ ఆర్ ఇ డి దళితులు, భూమి లేని కూలీలు, ఇర్యుల తెగ ఆదివాసులను, ఇటుక బట్టీ కార్మికులను, ఎడ్ల బండి కార్మికులు, క్వారీల కార్మికులు, దళిత మహిళలు(గ్రామీణ మహిళల విముక్తి ఉద్యమం ), మహిళా రైతులు, సెక్స్ వర్కర్లు , మాతమ్మలు ( జోగినీలు), వీధి వ్యాపారులు మొదలైన గ్రామీణ కార్మికులను ఉద్యమాలలోకి సమీకరిస్తుంది. వారికి అవసరమైన సమాచారాన్ని, సామర్థ్యాలను అందిస్తుంది. ఈ ఉద్యమాలు భూమి హక్కులు, రాజకీయ హక్కులపై కేంద్రీకరిస్తున్నాయి.

ఈ సమూహాలకు చెందిన మహిళలకు భూమి లేనప్పటికీ వారికి ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ వ్యవసాయ పద్ధతులలో శిక్షణలు ఇస్తున్నాము. ఇతర కులాలు, సమూహాలు అక్రమంగా ఆక్రమించిన ప్రభుత్వ భూములను గుర్తించి వాటిపై హక్కులు సాధించటంలో వారికి శిక్షణ ఇస్తాము. ఆ సమూహాలు భూమి హక్కులు కలిగి ఉండటం ఎంత అవసరమో

ఫోటో: SRED



మహిళా రైతుల బృందాలకు పంపిణీ కోసం సిద్ధంగా వున్న విత్తనాల ప్యాకెట్లు

అర్థం చేసుకున్నారు కనుక వాళ్ళు తమ గ్రామాల్లో ప్రభుత్వ భూములను గుర్తించగలిగారు. రెవెన్యూ అధికారుల సహాయంతో 7. 55 ఎకరాల భూమిని, మరొక 5 ఎకరాల భూమిని తిరిగి స్వాధీనం చేసుకుని సమిష్టి వ్యవసాయం మొదలుపెట్టారు. మహిళలందరూ కలిసి పంటలు సాగు చేసి పంట చేతికి వచ్చిన తర్వాత వారందరు సమానంగా పంచుకుంటారు. ఆ విధంగా 5 జిల్లాలలో మహిళా రైతులు సమిష్టి వ్యవసాయ చేస్తున్నారు.

## కోవిడ్ విపత్తు సమయంలో సహాయ కార్యక్రమాలు

కోవిడ్ వ్యాపిస్తున్న తరుణంలో విధించిన లాక్ డౌన్ 2020 మార్చ్ 24 వ తేదీ నుండి మొదలైంది, కానీ దాని దుష్పరిణామాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. పేదలకు తిండి, బతుకుతెరువు లేకుండా పోయింది. వాళ్లకు జీవించే మార్గం కనపడలేదు. లాక్ డౌన్ సమయంలో మహిళలపై గృహ హింస, ఇతర రకాల హింస పెరిగింది. ప్రభుత్వానికి పేదవాళ్లకు తిండి పెట్టాలనే ధ్యాసే లేకుండా పోయింది. వాళ్ళని ఇళ్లలోనుండి బయటకు రావద్దని మాత్రం చెప్పింది, కానీ మరొకవైపు మహిళలు మద్యం దుకాణాలను తెరవవద్దు అని డిమాండ్ చేసినప్పటికీ అన్నిటికంటే ముందుగా మద్యం దుకాణాలనే తెరిచింది. దీని కారణంగా మహిళలపై హింస మరింతగా పెరిగింది. దళిత మహిళలపై అత్యాచారం చేసి హత్య చేశారు. పేద కుటుంబాలవద్ద ఆహారం కొనుక్కోవడానికి డబ్బు లేకుండా పోయింది. ఆహారం లేకపోవటంతో కుటుంబంలో హింస ఎక్కువైంది. ఆదాయం లేక, తీసుకున్న అప్పులు తీర్చలేక, కుటుంబాలను పోషించలేక మహిళలు అందరికంటే ఎక్కువ ఇబ్బందులకు గురయ్యారు.

మిగిలిన వాళ్ళందరూ తమ కుటుంబాలు, తమ గ్రామస్థులు బతకడానికి మార్గాలని వెతకటానికి పోరాడుతుంటే మహిళా రైతుల సమిష్టి వ్యవసాయ సంఘం నాయకురాలు షకీలా కొంచెం భిన్నంగా అలోచించి ఆచరించటం మొదలుపెట్టింది. ఆమె ఆహార పదార్థాలు, ఇతర అవసరమైం వస్తువులు సేకరించి గ్రామస్థులకు పంచిపెట్టింది. ఈ పనిని ఆమె పెద్ద ఎత్తున చేపట్టింది, పోలీసుల కళ్లుగప్పి ఆమె ఇంటింటికి తిరిగి సేకరించగలిగినవన్నీ సేకరించింది. కార్యకర్తల బృందాన్ని ఏర్పాటు చేసింది. బుద్ధ మూవ్మెంట్ ట్రస్ట్ నుండి నాలుగు సార్లు కిరాణా సామాన్లు సేకరించి వాటిని తన గ్రామంలో దుర్భర స్థితిలో వున్న ఒంటరి మహిళలు, వికలాంగులు, ఆదివాసులు, చాకలి కుటుంబాలకు పంచిపెట్టింది .

ఎస్ ఆర్ ఇ డి సమిష్టి వ్యవసాయం చేస్తున్న మహిళా రైతులకు ఒక్కొక్కరికి 1000 రూపాయలు అందించింది, మూడు దఫాలుగా 1000 రూపాయల విలువైన ఆహార పదార్థాలను అందించింది. షకీలా స్వచ్ఛందంగా ముందుకొచ్చి వాటిని పంచిపెట్టటానికి ఎస్ ఆర్ ఇ డి కి సహాయపడింది.

జిల్లాలో ప్రయాణం చేయటానికి పరిస్థితులు అనుకూలించినప్పుడు షకీలా తన బృందంతో కలిసి వాళ్ళ సమిష్టి వ్యవసాయ కేంద్రంలో వున్న పంటలను కోత కోయటం

మొదలుపెట్టింది. ఆమె ఇతర సమిష్టి వ్యవసాయ సంఘాల నాయకులకు ఫోన్లు చేసి తమ వ్యవసాయ క్షేత్రంలో పండిన వాటిని ఏ విధంగా ఉపయోగించుకోవచ్చో ఒక ప్రణాళిక వివరించి మార్గదర్శకం అందించింది. మిగిలిన వాళ్ళు కూడా తమ గ్రామాలూ, దగ్గరలోని పట్టణాలలోని దాతల సహాయంతో, ప్రభుత్వ సహాయం, బుద్ధ మూవ్మెంట్ ట్రస్ట్, ఎస్ ఆర్ ఇ డి ల నుండి డబ్బు, ఆహార పదార్థాల రూపంలో సేకరించి అవసరంలో వున్న వారికీ పంపిణి చేయటంలో సహాయపడింది . వాళ్లంతా కలిసి కోవిడ్ బాధిత కుటుంబాలను గుర్తించి వారు ఈ విపత్తునుండి బయటపడటానికి సహాయపడ్డారు.

వారి స్వంత గ్రామాలలో సామూహిక వంటశాలలను ఏర్పాటు చేసి, వండిన ఆహార పదార్థాలను గ్రామస్థులకు పంపిణి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వారికి ఉచితంగా వంట గ్యాస్ అందించింది .

షకీలా చేపట్టిన కార్యక్రమాల వల్ల అనేక మంది ఆకలి చావులు, తిండిలేక ఆత్మహత్యలకు పాల్పడకుండా ప్రాణాలతో పతికి బయటపడ్డారు. ఆహార పదార్థాలతో కూడిన కిట్స్,, మాస్క్ లు, రోగనిరోధక శక్తిని పెంచే ఆయుర్వేద పానీయం మొదలైనవాటి అదనంగా 3000 కుటుంబాలకు వారి బ్యాంక్ అకౌంట్లలోకి ఎస్ ఆర్ ఇ డి నగదు బదిలీ చేయగలిగింది.

కోవిడ్ విపత్తు సమయంలో అందరిలో భయంతో పాటు కదలికలపై ఆంక్షలు ఉన్నప్పటికీ ఈ మహిళా రైతు నాయకులు సమిష్టి వ్యవసాయాన్ని సజీవంగా ఉంచారు. ఇది చూసి ఇతర మహిళలు కూడా సమిష్టి వ్యవసాయంలోకి ఆకర్షితులవుతున్నారు. వాళ్ళు భవిష్యత్తులో ఎటువంటి సవాళ్లు, విపత్తులు ఎదురైనా నిలదొక్కుకోగలము అనే విశ్వాశంతో వున్నారు. ఇరుగు పొరుగు గ్రామాల ప్రజలు తమ గ్రామంలో కూడా మహిళా రైతుల సమిష్టి వ్యవసాయ క్షేత్రాలను ఏర్పాటు చేయాలని వీళ్ళను ఆహ్వానిస్తున్నారు .

సమిష్టిగా భూమిని కలిగివుండటం అనేది ఒక పెద్ద బలం, కొరోనా వైరస్ కి నోరోధక శక్తిని సృష్టించుకోవటంలో అది సహాయంగా నిలిచింది . వైరస్ భయంలేకుండా మహిళా రైతులు ఐక్యంగా నిలబడ్డారు, ఒకరికొకరు అండగా నిలిచారు. ఒక ఉమ్మడి లక్ష్యం కోసం ఐక్యంగా నిలబడటం అనేది ఎటువంటి ప్రమాదకరమైన విపత్తు నైనా అధిగమించవచ్చు అని వాళ్ళు నిరూపించారు. ఈ విపత్తు సమయంలో ఉద్యమాలు అణగారిపోవటంలేదు, పైగా మరింత బలంగా పెరుగుతున్నాయి .

ఫోటో: SRED



మహిళా రైతులు కలిసి సమిష్టి వ్యవసాయ చేస్తున్న దృశ్యం

# 12. కోవిడ్-19 సందర్భంలో చిరుధాన్యాల వైపు తిరిగి ప్రయాణం

**రచయిత** : విమెన్స్ ఇనీషియేటివ్స్

ఫోటో: WINS



## విన్స్ - మహిళా రైతు వేదిక

విమెన్స్ ఇనీషియేటివ్స్ (విన్స్) గత మూడు సంవత్సరాలుగా ఆంధ్ర ప్రదేశ్ లోని చిత్తూరు జిల్లాలో 35 గ్రామాలలో వెయ్యి మందికి పైగా కౌలు రైతులు, వ్యవసాయ కూలీలను బలోపేతం చేయటంలో విజయవంతమైంది. దీనితో వాళ్ళు ఆర్థికంగా, రాజకీయంగా సాధికారత సాధించగలిగారు. వాళ్ళు ఇప్పుడు ప్రకృతి అనుకూల వ్యవసాయ పద్ధతులపై నమ్మకం కుదిరి వాటిని అనుసరించటానికి ముందుకొస్తున్నారు. వాళ్ళు రైతు ఉత్పత్తిదారుల సంఘాలు వంటి ఆర్థిక కార్యకలలో తమ నైపుణ్యాలను పెట్టటానికి ఆసక్తి చూపుతున్నారు. "మహిళా రైతు వేదిక" అనే వేదిక ద్వారా మహిళా రైతుల హక్కుల గురించి, తమ సమస్యల గురించి గళమెత్తుతున్నారు. పేద, అణగారిన మహిళలను సంఘటితపరచటంలో తమ జ్ఞానాన్ని పెంపొందించుకుని, దానిని ఉపయోగించి ముందుకు పోవటానికి ఈ మహిళా రైతులు కనబరచిన నిబద్ధత, శక్తి, సాహసం ఎంతైనా మెచ్చుకోదగ్గవి.

నెల రోజుల పూర్తి లాక్ డౌన్ కాలం మహిళలకు దుర్భరంగా తయారైంది.ఆ తర్వాత దానిని పొడిగిస్తూ పోవటం వారిని ఆర్థికంగా దెబ్బతీసి వాళ్ళు, వారి కుటుంబ సభ్యులు ఆకలికి గురికావలసి వచ్చింది, వారి నైతిక స్థైర్యం దిగజారింది. రవాణా సౌకర్యం లేక, చేతికి వచ్చిన పంటలను అమ్ముకునే దారి లేక, పశువులను మేపుకోలేక చాలా ఇబ్బందులు పడ్డారు. ఫలితంగా పంటలు ఎండిపోయాయి, పశువులు మేత లేక అల్లాడిపోయాయి, పాల దిగుబడి తగ్గిపోయింది. ప్రభుత్వం జారీ చేసిన కఠిన నియమాల కారణంగా కొరోనా పాజిటివ్ వచ్చిన గ్రామాల చుట్టూ బారికేడ్లు నిర్మించి రాకపోకలు నిషేధించారు. దీనితో మహిళలు ఇళ్లకు పరిమితమై పని చేసుకోవటానికి వీలు లేక, ఆదాయం లేక నరకం అనుభవించారు. దానికి తోడు వారు, చికిత్స లేని ఈ మాయదారి రోగం అంటుకుంటుంది అనే భయాలకు,

ఫోటో: WINS



వాటి చుట్టూ వ్యాపించిన అపోహలకు బలయ్యారు. ప్రభుత్వం తరఫున కోవిడ్ సహాయం కోసం అందించిన ధాన్యం, పప్పు వంటివి సరిపడినంత అందలేదు, వాటి కోసం పొడవాటి లైన్లలో నిలబడాల్సి వచ్చింది, తరుచు వాళ్ళు లైన్లలో నిలబడి రేషన్ దొరకక ఉట్టి చేతులతో తిరిగి రావలసి వచింది.

చిత్తూరు జిల్లాలోని సిజిగల్లు, రొంపిచెర్ల మండలాలు వర్షాధారిత ప్రాంతాలు. ఇక్కడ 60% మంది రైతులు కేవలం హైబ్రిడ్ టమాటాలు మాత్రమే ఏడాదిలో రెండు పంటలు పండిస్తారు. వాటికి మంచి ధర వస్తుంది కానీ పెట్టుబడి ఖర్చు కూడా చాలా ఎక్కువ ఉంటుంది. ఇక్కడి మహిళా రైతులు ఇతరుల పొలాలలో రోజు కూలీలుగా కూడా పనిచేస్తారు. మామిడి తోటలు, వేరుశెనగ వంటి ఒకే రకం పంటలు వేయటం అనే పద్ధతి కూడా వాళ్ళను కష్టాలలోకి నెట్టింది. ఈ ప్రాంతంలో ఎక్కువ మందికి చిన్న మడి చెక్కలు(కొన్ని సెంట్లు ) ఉంటాయి, వాటిలో సాగు చేయటం వల్ల లాభం లేదనుకుని వాటిని చాలా వరకు సాగు చెయ్యకుండా పడావు పెడతారు. ఈ పరిస్థితిలో విమెన్స్ ఇనీషియేటివ్స్ సంస్థ వారిని సంఘటితం చేసి కూరగాయలు పండించటానికి ప్రోత్సహించింది. వారికి 12 రకాల కూరగాయ విత్తనాలను ఇచ్చి పెరటి తోటల పెంపకం చేసుకోవటానికి సహాయపడింది, ఇది కోవిడ్ విపత్తు సమయంలో చాలా ఉపయోగపడింది.

వారు సాంప్రదాయకంగా చిరుధాన్యాలను తింటూ వచ్చినప్పటికీ 40 ఏళ్ల క్రితం నుండి అవి కనుమరుగైపోయాయి. ఇక్కడి గ్రామాలలో 1% భూమిలో మాత్రమే వాటిని పండించటం వల్ల వాటిని కొనుక్కునే పరిస్థితి లేకుండా పోయింది. దానికి తోడు చిరుధాన్యాలు తింటే కోవిడ్ ను ఎదుర్కోవటానికి రోగ నిరోధక శక్తి పెరుగుతుంది అని నిపుణులు సూచించటంతో ధనికులు వాటిని అధిక ధరలకు కొనుక్కుని తినటం మొదలైంది . అంత ధరలు పెట్టి సామాన్య ప్రజలు తినే పరిస్థితి లేదు. విన్స్ తరఫున మేము మహిళలకు ఈ విషయం గురించి వివరంగా చెప్పటంతో వాళ్ళు మళ్ళీ చిరుధాన్యాలను సాగు చేయటానికి ముందుకొచ్చారు, వాటి వల్ల తక్కువ ధరకు పోషకాహారాన్ని పొందవచ్చు అని వాళ్ళు అర్థం చేసుకున్నారు. దీనితో పాటు వాళ్ళు పెరటి తోటల పెంపకం, పండ్ల తోటల పెంపకంలో గో ఆధారిత వ్యవసాయ పద్ధతులను అనుసరించటంతో వారికి కోవిడ్ సంక్షోభ సమయంలో వారిని అవి కాపాడాయి.

సాంప్రదాయక పద్ధతులు, పంటల పునరుద్ధరణ చూసి సంతృప్తి చెందిన మహిళా రైతులను ఈ ప్రక్రియలో చేరవలసిందిగా ప్రోత్సహించాము .

మహిళా రైతు వేదిక వ్యవసాయంలో బాగా పనిచేస్తున్న కౌలు రైతులను, చిన్న సన్నకారు రైతులను గుర్తించి. సేంద్రియ పద్ధతులలో ఆసక్తి కలిగి వాటిని ఉపయోగిస్తూ దానివల్ల కలిగే ప్రయోజనాలను పొందుతున్న వారిని ఎంపిక చేసింది. వారిలో 223 మంది రాగులు సాగు చేయటానికి, 110 మంది సజ్జలు, 40 మంది అండ్రు కొర్రలు సాగుచేయటానికి ముందుకొచ్చారు. ఈ వేదికలు చిరుధాన్యాల సాగులో వుండే అనేక ఇబ్బందులను చర్చించారు, మొలకెత్తటం నుండి కంకులు ఎండిపోవడం, కోత సమయంలో మొక్కలు ఎండకపోవటం, వర్షం వల్ల గింజలు కుళ్లిపోవటం, పక్షులు, గుడ్లగూబలు, పందులు పంటలను తినెయ్యటం వంటి సమస్యల గురించి చర్చించారు. వాటికి పరిష్కారాలను కనుగొనటానికి ప్రయత్నించారు. మిగిలిన వాటికంటే సజ్జలు బాగా అనుకూలంగా వుంటాయని కనుగొన్నారు.

చిరుధాన్యాలు వర్షాధారంతో పండుతాయి, పైగా స్వల్ప కాలిక పంటలు కావటంతో మహిళా రైతు వేదికలు వాటిని పండించటానికి ముందుకొచ్చాయి . భవిష్యత్తులో ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే అనిశ్చిత పరిస్థితులు ఏర్పడినప్పుడు స్వయం శక్తిపై ఆధారపడవచ్చు నని, అటువంటి కష్టసమయాలలో కూడా ఆహార భద్రతకు హామీ ఉంటుందని వాళ్ళకి నమ్మకం కలిగింది.

అధిక శ్రమతో కూడిన వ్యవసాయ పనులలో మహిళల భాగస్వామ్యాన్ని ప్రాముఖ్యతలేనిదిగా తక్కువ చేసి చూస్తారు. మహిళలు తమ మనుగడకోసం చేస్తున్న పోరాటంలో తమ భాగస్వామ్యాన్ని నొక్కి చెప్పలేకపోయారు. విన్స్ వారికి శిక్షణ అందించి, మద్దతునిచ్చి , తమ హక్కులకోసం పోరాడే విధంగా నమ్మకం కలిగించింది, ప్రస్తుత వ్యవస్థలో వారు ఎదుర్కుంటున్న సవాళ్ళను ఎదుర్కోవటానికి ఆత్మ విశ్వాసం కలిగించింది. ఏనాడూ వ్యవసాయ శాఖ అధికారులు, నిపుణులు వేళ్ళని గ్రామాలలోకి విన్స్ వెళ్లి అక్కడి మహిళలను ప్రోత్సహించింది.

ఆకలిని జయించటం సాధ్యమేనని, అది మహిళా రైతు ఉత్పత్తిదారులలో చేతులలో ఉందని విన్స్ గుర్తించింది , సరిపడినంత మంచి ఆహారం తినటానికి వాళ్ళకి కారణాలు వున్నాయి హక్కులు ఉన్నాయని కూడా గ్రహించింది. కేవలం వ్యవసాయ సంబంధమైన పనులే కాక జెండర్ సమానత్వం పట్ల కూడా వారిలో అవగాహన పెంపొందింది. అది మహిళలు తమను తాము మనుషులుగా, శక్తివంతమైన వ్యక్తులుగా చూసుకోవటానికి వీలు కల్పించింది, ఇది వాళ్ళని ఆకర్షించింది. ఆరోగ్యానికి ఆహారం పునాది అనే వాస్తవాన్ని ఈ మొత్తం కార్యక్రమం పునః స్థాపించింది . ఆహార ఉత్పత్తిదారులుగా వాళ్ళు తమకే కాక అందరికీ ఆహార భద్రతను కల్పించటంలో కృషి చేశారు.

# 13. ఆర్థిక సంఘీభావం, స్వయం శక్తి పైఆధారపడటం వైపుగా హాపూర్ మహిళా రైతుల ప్రయాణం

**రచయిత**: సులేఖ సింగ్

## నేపథ్యం

యాక్షన్ ఇండియా సంస్థ అనేక దశాబ్దాలుగా అట్టడుగు స్థాయిలో వున్న సమూహాలకు చెందిన మహిళలు, కిశోర బాలికలు, పిల్లల సమస్యలపై పనిచేస్తూ వారి ఆరోగ్యం, హక్కులు సాధించటం కోసం పాటిస్తున్నది. 2011 లో ఈ పని ఢిల్లీ నుండి ఉత్తర్ ప్రదేశ్ లోని హాపూర్ వరకు అక్కడి మహిళల ఆర్థిక, సామాజిక, సైద్ధాంతిక సాధికారతను బలోపేతం చేసేందుకు విస్తరించింది. ఈ సంస్థ తరఫున మహిళా రైతుల అదృశ్య పాత్రను పనిని గుర్తించటం కోసం ప్రయత్నించింది, 4 గ్రామాలలోని 200 మంది మహిళా కూలీలను సంఘటితపరచటానికి ప్రయత్నించింది . 10-12 మంది మహిళా వ్యవసాయ కూలీల బృందం ఈ పనికి ఇప్పుడు నాయకత్వం వహిస్తున్నారు.

## కోవిడ్ విపత్తు సమయంలో కార్యక్రమాలు

కోవిడ్ కారణంగా లాక్ డౌన్ విధించటంతో అప్పటివరకు అమలులో వున్న సమిష్టిగా లీజుకు తీసుకునే ఉత్పత్తి వ్యవస్థ భూ యజమానులు తమ భూమిని లీజుకివ్వటానికి సిద్ధంగా లేకపోవటంతో విచిన్నమైంది . భూ యజమానుల కుటుంబ సభ్యులు వలస నుండి తిరిగి వచ్చి తమ భూములలో పనిచేసుకోవటంతో అప్పటివరకు వాటిని లీజుకి తీసుకున్నవారికి లీజుకివ్వలేదు. దీనితో ఆ బృందం నుండి 10-12 మంది మహిళలు వ్యవసాయం ద్వారా రాకుండా కోల్పోయిన ఆదాయానికి ప్రతామ్నాయ అవకాశాల కోసం వెతకాలని నిర్ణయించారు.

ఇరుగుపొరుగు ప్రాంతాలకు చెందిన వివిధ ఎస్ హెచ్ జి గ్రూపులకు చెందిన మహిళలు మసాలా దినుసులు శుద్ధి చేసి, పొడి చేసి అమ్మటం అనే ఒక ప్రత్యామ్నాయ ఆర్థిక కార్యకలాపం మొదలుపెట్టాలని నిర్ణయించుకున్నారు. వారందరు తమ తమ ఎస్ హెచ్ జి గ్రూపులనుండి రుణాలు తీసుకుని వాటిని మసాలా దినుసులు కొనటానికి పెట్టుబడిగా ఒకచోట చేర్చారు . వాటిని శుద్ధి చేసి పొడి చేసి ప్యాకెట్లు గా మా ర్చి దగ్గరలోని 20 గ్రామాలలో స్థానికంగా అమ్మటం మొదలుపెట్టారు. వారి ఉత్పత్తులు నాణ్యంగా ఉండటంతో క్రమంగా వాటికి డిమాండ్ పెరిగింది, వారి సోషల్ యాక్షన్ నెట్వర్క్ ద్వారా అమ్మకాలు ఢిల్లీ వరకు విస్తరించాయి. నేషనల్ కాపిటల్ రీజియన్ (NCR అంటే ఫరీదాబాద్, గుర్గావ్, ఘజియాబాద్, నోయిడా వంటి ఢిల్లీ చుట్టూ వున్న ఉపగ్రహ నగరాలతో కూడిన ప్రాంతం ) లోని 900 కుటుంబాలకు అవి అమ్మటం మొదలైంది.

## కార్యక్రమం యొక్క ప్రభావం

హాపూర్ బ్లాక్ ఢిల్లీకి సమీపంలో వుంది. ఈ 12 మంది మహిళల బృందం సంఘటితపడి ఢిల్లీకి సమీపంలోని ప్రాంతంలో ఆర్థిక కార్యకలాపం మొదలుపెట్టి వాళ్ళు కొరోనా కాలంలో జీవనోపాధుల సంక్షోభాన్ని అధిగమించటానికి కొత్త అవకాశాలన అన్వేషించారు. తమకున్న వ్యవస్థాగతమైన సంబంధాల ద్వారా వాళ్ళు స్వయం ఆధారిత ఉపాధికి అవకాశాలను నెలకొల్పుకోవటమే గాక వారి మధ్య సంఘీభావాన్ని పటిష్టంచేసుకో గలిగారు. వారిలో ప్రతి మహిళ ఋణం తీసుకోవటం ద్వారా ముడి పదార్థాల కొనుగోలుకు తమ భాగం అందించారు, అందరు కలిసి శ్రమించి మసాలా దినుసులను పొడి చేసి వివిధ మార్గాల ద్వారా వాటి అమ్మకాలు సాగించారు. తర్వాత వాళ్ళు లాభాలను పెంచుకోవటానికి గోధుమలు కూడా కొని పిండి చేసి అమ్మి తమ వ్యాపారాన్ని విస్తరించుకున్నారు

## విస్తరణ

ఈ పనిలో చేకూరిన ఆర్థిక సుస్థిరత ఆ మహిళల బృందానికి కోవిడ్ సమయంలో సంక్షోభాన్ని ఎదుర్కోవటానికి, తమ సమిష్టి వ్యాపారాన్ని కొనసాగించటానికి ప్రోత్సాహాన్ని ఇచ్చింది. ప్రస్తుతం ఒక్కొక్క దానిలో 12-15 మంది సభ్యులు గల 75 ఎస్ హెచ్ జి గ్రూపులు వారి ఉత్పత్తులు కావాలని అడుగుతున్నారు. దీనితో వారికి స్థిరమైన డిమాండ్, ఆదాయం వస్తుందన్న హామీ లభించింది. వాళ్ళు తమ మార్కెట్ ను ఇతర గ్రామాలకు, ఢిల్లీ మొత్తానికి విస్తరించడానికి గల అవకాశాలను అన్వేషిస్తున్నారు. వాళ్ళు ఇప్పుడు తమ వ్యాపారాన్ని విస్తరించి మరింత ఎక్కువ మంది మహిళలను చేర్చుకోవటానికి ఒక వ్యాపార ప్రణాలికను రూపొందించుకున్నారు.

## ఫలితాలు

ఈ మహిళల వేదిక ఇప్పుడు తమ ఉత్పత్తులలో జీలకర్ర, వాము, మెంతులు, మక్కజొన్న, సజ్జ, బెల్లం, ఆవ నూనె, సెనగలు, బియ్యం, పప్పులు మొదలైనవాటిని చేర్చి విస్తరిస్తున్నది. వేదిక సభ్యులు మసాలా దినుసులు, ధాన్యం, పప్పుల విలువ ఎట్లా పెంచవచ్చో నేర్చుకుని సంఘీభావ ఆర్థిక కార్యకలాపాల ద్వారా సంక్షోభం నుండి బయటపడగలిగారు. క్రమంగా వాళ్ళు మళ్ళీ సమిష్టి వ్యవసాయానికి భూమిని లీజుకి తీసుకుని, ప్రకృతి అనుకూల పద్ధతులలో పంటలు పండించి, వచ్చిన ఉత్పత్తిలో తమకు అవసరమైనవి ఉంచుకుని మిగిలినవి వ్యాపారంలో ఉపయోగించాలని ప్రణాళిక వేశారు. ధరల విషయంలో అనుకూలంగా వుండే పట్టణ మార్కెట్ లోకి విస్తరించాలని వాళ్ళు ప్రణాళిక తయారు చేసుకున్నారు. వ్యాపార ప్రణాళిక తయారుచేయడంలో, ధరలను నిర్ణయించటంలో, అమ్మకాలలో కొత్తగా అలవరచుకున్న నైపుణ్యాలు వారికి నమ్మకాన్ని కలిగించాయి, కొంతవరకు ఆర్థిక సుస్థిరతను ఏర్పరచాయి. అదే సమయంలో భవిష్యత్తు ప్రణాళికలు తయారు చేయటానికి అనువైన ఆస్తులను సృష్టించాయి. రసాయన వ్యవసాయ పద్ధతుల స్థానంలో అందరికీ ఆరోగ్యాన్ని కలిగించే సహజ ఎరువులు, స్థానిక విత్తనాల ఆధారంగా ప్రకృతి వ్యవసాయంపై ఆధారపడిన విలువను జోడించే వ్యాపారంగా ఎదగాలని, వారు ఆశిస్తున్నారు. తమ వ్యాపారంలో మరింత మంది దుర్బల స్థితిలో వున్న మహిళలను చేర్చుకుని తమ స్వంత సమూహాలకు చెందిన మహిళలకు సుస్థిరమైన జీవనోపాధులు, మెరుగైన ఆరోగ్యం కల్పించాలన్నలక్ష్యానికి కట్టుబడి వున్నారు. వాళ్ళు ఒక విత్తనాల బ్యాంకును కూడా నెలకొల్పి మహిళా రైతులకు స్వాభిమానాన్ని, మంచి నాణ్యమైన జీవితాన్ని పునరుద్ధరించాలని కూడా లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మహిళా వేదిక వ్యక్తిగతంగా సాధ్యం కాని వనరుల సమీకరణ, నైపుణ్యాల కూర్పును సాధ్యం చేసి చూపింది. మార్కెట్లు వారికి దగ్గరలో ఉండటం అనేది తమ వ్యాపారాన్ని నిర్వహించటాన్ని సులభతరం చేసింది .

## కీలకమైన గుణపాఠాలు

అప్పటికే మహిళలలో వున్న నైపుణ్యాలు, సహజ వనరులను ఉపయోగించటం ద్వారా సంక్షోభాన్ని తట్టుకోగల శక్తి సమకూరింది, సమిష్టి సంఘీభావాలను ఏర్పరచు కోవటంతో తమ సమిష్టి బలాలపై ఆధారపడి విజయం సాధించటానికి వీలు కలిగింది . తమ ఉత్పత్తులలో నాణ్యత, ధరల ప్రమాణాలు మార్కెట్ ను బట్టి ఉండాలని వాళ్ళు నేర్చుకున్నారు. ఈ వ్యాపారం మహిళలకు ఆర్థిక, సామాజిక సాధికారత సాధించటానికి సమిష్టి సంఘీభావం అనేది ఒక కొత్త ఆశను కల్పించింది .

# నేర్చుకున్న పాఠాలు - భవిష్య త్ మార్గం

సంక్షోభంలో సాధారణంగా జరిగే దానికంటే కోవిడ్ సమయంలో మహిళలుఒక భిన్నమైన మార్గాన్ని చేపట్టి నాయకత్వం వహించారని ఈ కథలు చూపిస్తున్నాయి. మహిళలు నాయకత్వం వహించిన ఈ కథల నుండి భవిష్యత్తు కోసం చాలా పాఠాలు నేర్చుకోవచ్చు .

## ఈ సంకలనంలోని కథలన్నీ ఈ క్రింది అంశాలను ప్రతిఫలిస్తాయి:

1. మొదటి విషయం ఏమిటంటే మహిళల సమూహాలు/సంఘాలు ఈ గడ్డు కాలంలో తమ తోటివారు, ఇతర పేద /ఒంటరి మహిళలు తిండికి లోటులేకుండా ఉండేటట్లు చర్యలు తీసుకున్నారు.

2. దీనినుండి స్పష్టంగా తేలేదేమంటే మహిళా సమూహాలు, మహిళల నాయకత్వం సంక్షోభ సమయాలలో ఎక్కువ మంది మహిళల సమస్యలను తీర్చటానికి వినూత్న ఆలోచనలతో ముందుకురావటమే గాక వారు అత్యంత పేదలు, దుర్బల స్థితిలో వున్న మహిళల అవసరాల పట్ల సున్నితత్వంతో వ్యవహరిస్తారు. అటువంటి వారి అవసరాలను తీర్చేందుకు తమ పని విధానాన్ని మలుచుకుంటారు. కోవిడ్ విపత్తు స్త్రీ, పురుషులపైన భిన్నమైన జెండర్ పరమైన ప్రభావాన్ని కలిగించిన సందర్భంలో ఇటువంటి మహిళా సంఘాలు దుర్బల స్థితిలో వున్న మహిళల సమస్యలను సున్నితత్వం, నైపుణ్యం మేళవించి పరిష్కారమార్గాలు చేపడతారు.

3. మరొకముఖ్యమైన గుణపాఠం ఏమిటంటే, మహిళా సంఘాలు నిర్వహించిన స్థానిక, వికేంద్రీకరించిన పద్ధతులు పేద మహిళలకు అత్యంత అవసరమైన ఆహారాన్ని అందించటానికి చాలా అవసరం. ప్రత్యేకించి వాతావరణం అనిశ్చితంగా ఉండి ఆహారసరఫరాలో ఆటంకాలు ఏర్పడే ప్రమాదం వున్నప్పుడు ఈ పద్ధతులు చాలా ఉపయోగకరం. స్థానికంగా సరుకులన్ను కొనుగోలు చేసి అవసరంలో వున్నవారికి అందించటం అనే మార్పుతో కూడి స్థానిక ఆర్థిక వ్యవస్తలోకే డబ్బు తిరిగి వెళ్లేటట్లు మహిళలు నిర్వహించిన ఈ పద్ధతులు సుస్థిరమైన పంపిణి వ్యవస్థకు దారి తీస్తాయి.

4. మహిళలు స్వల్ప కాలిక అవసరాలకంటే ముందుకెళ్లి దూరదృష్టి తో అలోచించి దీర్ఘకాలిక ప్రయోజనాల గురించి కూడా అలోచించి స్థానికంగా సేంద్రియ కూరగాయలు పండించటంపై కేంద్రీకరించినట్లు కేరళలో తనల్, గుజరాత్ లో డబ్ల్యూ జి డబ్ల్యూ ఎల్ ఓ , హెచ్ డి ఆర్ సి, మహారాష్ట లోని కోర్చి మహా సభ, ఆంధ్రప్రదేశ్ లో రెడ్స్ సంస్థల కథలు తెలియజేస్తాయి. వారు తర్వాతి సీజన్ లో పండించటానికి విత్తనాలను కూడా రైతులకు అందుబాటులోకి తెచ్చే ప్రయత్నాలు చేశారు.

5. మకాం ఢిల్లీ, యమునా ఖద్దార్ కథనాలు గ్రామీణ పట్టణ ప్రజల మధ్య వున్న సంబంధాన్ని కోవిడ్ సంక్షోభ సమయంలో అర్థం చేసుకోవాల్సిన అవసరాన్ని లేవనెత్తాయి. నగరాలలో నివసిస్తున్న వ్యవసాయ కుటుంబాలకు చెందిన మహిళలు ప్రభుత్వ అధికారులకు అదృశ్యులుగా ఉండిపోయారు. ఈ రెండు కథలలో కూడా గ్రామీణ, పట్టణ ప్రాంత మహిళలు స్నేహ సంబంధాలను ఏర్పరచుకుని సహాయ కార్యక్రమాలలో ఒకరికొకరు సహాయపడ్డారు, గ్రామీణ - పట్టణ ప్రాంతాల మధ్య దీర్ఘకాల సంఘీభావాలను ఏర్పరచటానికి గల అవకాశాలకు దారి చూపారు.

అనేక సంఘాల ఐక్యవేదిక అయిన మకాం కోవిడ్ లాక్ డౌన్ సమయంలో క్షేత్ర స్థాయిలో సహాయ కార్యక్రమాలలో నిమగ్నమవటంతో పాటు, జాతీయ మానవ హక్కుల కమిషన్, నీతి ఆయోగ్, రాష్ట ప్రభుత్వాలు వంటి వివిధ ప్రభుత్వ సంస్థలు వేదికలకు ఆహారం, ఉపాధి అందుబాటు వ్యవస్థలను పటిష్ఠం చేయటానికి సలహాలు సూచనలను అందించింది. రేషన్ దుకాణాల ద్వారా జరిగే ప్రభుత్వ ఆహార పంపిణి వ్యవస్థ రేషన్ కార్డులు వున్నవారికి మాత్రమే కాకుండా సార్వజనీనంగా అందరికి వర్తింపచేయాలనే తక్షణ డిమాండ్ ను ముందుకు తెచ్చింది. ప్రభుత్వ పంపిణి వ్యవస్థలోకి కేవలం వరి గోధుమ వంటి ధాన్యాలే కాకుండా పోషకాలతో కూడిన చిరుధాన్యాలు పప్పుధాన్యాలు వంటివి కూడా అందించేలాగా విస్తరించాలని డిమాండ్ చేసింది. ఉపాధి భద్రత కల్పించటానికి జాతీయ ఉపాధి హామీ పథకాన్ని విస్తారింపజేసి మహిళా రైతులకు ఉత్పాదక ఆస్తులను పెంపొందించే విధంగా దానిలో కార్యక్రమాలను జోడించాలనేది మకాం ముందుకు తెచ్చిన మరొక ప్రధానమైన డిమాండ్.

తాత్కాలిక సహాయ చర్యలతో పాటు, దీర్ఘకాలంలో మహిళలకు ప్రకృతికి అనుకూలమైన గ్రామీణ జీవనోపాధులను నిర్మించి, సహాయం అందించి పటిష్టం చేసే అవకాశంగా కూడా దీనిని చూడవచ్చు . అయితే దీనికోసం మహిళలు ఎక్కువగా ఆధారపడుతున్న వ్యవసాయం, నీరు తదితర ఉమ్మడి వనరుల అభివృద్ధి లో ప్రభుత్వం పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుంది. మహిళలను భూములు, అడవులు తదితర వనరులనుండి తొలగించే విధానాల స్థానంలో వారికి ఈ వనరులు ఎక్కువగా అందుబాటులోకి వచ్చే విధంగా వెందే విధానాలు రూపొందాలి, ఇందుకోసం మహిళల మానవ హక్కులపై కేంద్రీకరించే దూరదృష్టి అవసరమవుతుంది, అది అధికారము, వనరులను పునః సమీక్షించి పునః పంపిణి చేసే అభివృద్ధి నమూనాను తీసుకురావటం ద్వారా ప్రస్తుత వినాశకర అభివృద్ధి నమూనాను సమూలంగా మార్చేదిగా ఉండాలి.

అన్నిటికంటే ముఖ్యంగా ప్రభుత్వం సామాజిక ఆర్థిక సంఘీభావాలను పటిష్టంచేసే మార్గాలను చూపుతున్న మహిళల నాయకత్వంలో జరిగిన వినూత్న కార్యక్రమాల నుండి నేర్చుకోవటానికీ, వాటిని బలపరచి వారితో భాగస్వామ్యం వహించటానికీ మరింత సంసిద్ధంగా ఉండాలి.

ఈ పుస్తకం తీసుకురావటంలో ప్రధానంగా మేము సంక్షోభకాలంలో తట్టుకుని ధృడంగా నిలబడి పోరాడి, కొత్త మార్గాలను కనుగొన్న మహిళా రైతులకు, వారి సంఘాలకు రుణ పడి ఉంటాము, ఎల్లప్పుడూ ఒక ప్రత్యామ్నాయం ఉంటుంది అనే విషయాన్ని ఈ మహిళలు నిరూపించారు.

రెడ్స్ నుండి సి.భానుజ; కోర్చి మహాగ్రామసభ నుండి కుమారిబాయి జామ్కటన్; ఆనంది నుండి సేజల్ దండ్ నీతా హార్దికర్ లు; ఢిల్లీ మకాం బృందంలోని డాక్టర్ సోమా కె.పి, సులేఖ(యాక్షన్ ఇండియా ), ముబశిరా జైదీ; ప్రకృతి నుండి సువర్ణ దాంమ్లే, నిర్మల కథాళే; రిష రామచంద్రన్, ముబశిరా జైదీ సహాయంతో విక్రమ్ సింగ్; గుజరాత్ కు చెందిన హెచ్ డి ఆర్ సి, డబ్ల్యూ జి డబ్ల్యూ ఎల్ ఓ, ఉత్థాన్; కేరళ కు చెందిన తనల్, తమిళనాడుకు చెందిన ఫాతిమా బెర్నాడ్, ఆంధ్ర ప్రదేశ్ కు చెందిన విన్స్,, ఉత్తర్ ప్రదేశ్ కు చెందిన సులేఖ సింగ్ వంటి వ్యక్తులు, సంస్థలు చేసిన ప్రయత్నాలతో ఈ పుస్తకం రూపొందింది.

ఈ అంశంపై వెబినార్ ను నిర్వహించి మహిళా రైతుల కథనాలను ఒకచోటకు తేవటంలో మకాంను ఉతేజితం చేసిన గ్లోబల్ టేపెస్ట్రి ఇనీషియేటివ్స్ (GTA) కు మా ధన్యవాదాలు.

ఈమొత్తం ప్రయత్నాన్ని మకాం నుండి శిల్ప వాసవాడ, సీమ కులకర్ణి సమన్వయం చేశారు. వారికి మకాం జాతీయ కమిటీ సభ్యులు డాక్టర్ ఉష సీతాలక్ష్మి, డాక్టర్ సోమా కె పి, ఎస్ ఆశాలత తమ అభిప్రాయాలను సహకారాన్ని అందించారు. మకాం జాతీయ సమన్వయకర్త గార్గి మంగుల్కర్ తో పాటు ఈ ఆలోచనకు మద్ధతు నిచ్చిన ఇతర మకాం మిత్రులకు ఈసందర్భంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాము..
మకాం ను సంప్రదించటానికి వివరాలు : గార్గీ మంగుల్కర్, mahilakisan.makaam@gmail.com / 9604779666

తెలుగు అనువాదం: ఆశాలత, డిజైన్, లే అవుట్ నవీద్ దాదన్ .

ఈ డాక్యుమెంట్ ప్రచురణలు హెన్రిక్ బోల్ ఫౌండేషన్ మరియు మిసేరియర్ సంస్థలు ఆర్థిక సహాయాన్ని అందించాయి.

**ప్రస్తావన** : వికల్ప్ సంఘం, సీడింగ్ హోప్ : ఉమెన్స్ కలెక్టివ్స్ క్రియేట్ పాత్ వేస్ ఫర్ చేంజ్ - సంపుటి 4 "సాధారణ మనుషుల అసాధారణ కృషి కోవిడ్ విపత్తు, లాక్ డౌన్ ను జయించిన కథలు, వికల్ప్ సంఘం కోర్ గ్రూప్, మార్చ్ 2021.

ఈ పుస్తకాన్ని ప్రచురించిన వికల్ప సంఘం దీనిపై కాపీ రైట్ హక్కులను వదులు కుంటున్నద. మూలంలో వున్న రచయితలు, ప్రచురణకర్తలను పేర్కొంటూ కాపీ రైట్ లు లేకుండా ఎవరైనా దీనిని వాణిజ్యేతర అవసరాలకు తిరిగి ముద్రించవచ్చు,

ఈ కథల సంకలనాన్ని వివిహాదా భాషలలో చూడటానికి ఈ క్రింది లింక్ లు చూడండి :
'సాధారణ' మనుషుల అసాధారణ కృషి: సంపుటి 1, గ్రాఫిక్ నవల
కోవిడ్ సంక్షోభ సమయంలో అటవీ హక్కులు: మార్గం చూపిన గ్రామ సభలు: సంపుటి 2, గ్రాఫిక్ నవల
పశ్చిమ హిమాలయాలలో కోవిడ్ విపత్తును తట్టుకుని నిలబడటం : సంపుటి 3
యువత ఆకాంక్షలు, తట్టుకుని నిలబడే శక్తి, సమిష్టిగా కళలు కనటం: సంపుటి 5

వికల్ప్ సంఘం అనేది మానవ, పర్యావరణ శ్రేయస్సు కోసం న్యాయమైన, సుస్థిర మార్గాలను అనుసరించి పనిచేసే ఉద్యమాలు, సంస్థలు, వ్యక్తులను ఒక చోటకు తెచ్చే వేదిక. అది ప్రస్తుత అభివృద్ధి నమూనాను, అది కొనితెచ్చే అసమాన, అన్యాయ నిర్మాణాలను తిరస్కరిస్తుంది, ఆచరణలోను ఆలోచనలోను వాటికి ప్రత్యామ్న్యాయాలను అన్వేషిస్తుంది. ఈ కింద పేర్కొన్న 60కి పైగా ఉద్యమాలు, సంఘాలు, సంస్థలు వికల్ప్ సంఘంలో సభ్యులుగా వున్నాయి.

మరింత సమాచారం కోసం వికల్ప్ సంఘం వెబ్ సైట్ ను చూడండి:
http://www.vikalpsangam.org/about/

www.vikalpsangam.org

- ACCORD (Tamil Nadu)
- Alliance for Sustainable and Holistic Agriculture (national)
- Alternative Law Forum (Bengaluru)
- Ashoka Trust for Research in Ecology and the Environment (Bengaluru)
- BHASHA (Gujarat)
- Bhoomi College (Bengaluru)
- Blue Ribbon Movement (Mumbai)
- Centre for Education and Documentation (Mumbai)
- Centre for Environment Education (Gujarat)
- Centre for Equity Studies (Delhi)
- CGNetSwara (Chhattisgarh)
- Chalakudypuzha Samrakshana Samithi / River Research Centre (Kerala)
- ComMutiny: The Youth Collective (Delhi)
- Deccan Development Society (Telangana)
- Deer Park (Himachal Pradesh)
- Development Alternatives (Delhi)
- Dharamitra (Maharashtra)
- Ekta Parishad (several states)
- Ektha (Chennai)
- EQUATIONS (Bengaluru)
- Extinction Rebellion India (national)
- Gene Campaign (Delhi)
- Goonj (Delhi)
- Greenpeace India (Bengaluru)
- Health Swaraaj Samvaad (national)
- Ideosync (Delhi)
- Jagori Rural (Himachal Pradesh)
- Kalpavriksh (Maharashtra)
- Knowledge in Civil Society (national)
- Kriti Team (Delhi)
- Ladakh Arts and Media Organisation (Ladakh)
- Local Futures (Ladakh)
- Maadhyam (Delhi)
- Maati (Uttarakhand)
- Mahila Kisan Adhikar Manch (national)
- Mahalir Association for Literacy, Awareness and Rights (MALAR)
- Mazdoor Kisan Shakti Sangathan (Rajasthan)
- National Alliance of Peoples' Movements (national)
- Nirangal (Tamil Nadu)
- North East Slow Food and Agrobiodiversity Society (Meghalaya)
- People's Resource Centre (Delhi)
- Peoples' Science Institute (Uttarakhand)
- Revitalising Rainfed Agriculture Network (national)
- reStore (Chennai)
- Sahjeevan (Kachchh)
- Sambhaavnaa (Himachal Pradesh)
- Samvedana (Maharashtra)
- Sangama (Bengaluru)
- Sangat (Delhi)
- School for Democracy (Rajasthan)
- School for Rural Development and Environment (Kashmir)
- Shikshantar (Rajasthan)
- Snow Leopard Conservancy India Trust (Ladakh)
- Sikkim Indigenous Lepcha Women's Association
- Social Entrepreneurship Association (Tamil Nadu)
- SOPPECOM (Maharashtra)
- South Asian Dialogue on Ecological Democracy (Delhi)
- Students' Environmental and Cultural Movement of Ladakh (Ladakh)
- Thanal (Kerala)
- Timbaktu Collective (Andhra Pradesh)
- Titli Trust (Uttarakhand)
- Tribal Health Initiative (Tamil Nadu)
- URMUL (Rajasthan)
- Vrikshamitra (Maharashtra)
- Watershed Support Services and Activities Network (Andhra Pradesh/Telangana)
- Youth Alliance (Delhi)
- Yugma Network (national)
- Let India Breathe
- Travellers' University
- Dinesh Abrol
- Sushma Iyengar